E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 20 -06-2025 (వారం) శుక్రవారం
హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




ఆస్పత్రిపై దాడి.. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేస్తే భారత్‌పై భారం? » 3లో

# మళ్లీ తెరపైకి ఇచ్చంపల్లి–సాగర్


- కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ ముందు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ప్రతిపాదన
- గోదావరి జలాలను వినియోగించాలనుకుంటే దీనిపై చర్చకు సిద్ధమని వెల్లడి
- గతంలో ఈ అనుసంధాన ప్రాజెక్టును ప్రతిపాదించిన కేంద్రం
- 15.8 టీఎంసీల సామర్థ్యంతో ఇచ్చంపల్లి వద్ద బరాజ్ నిర్మాణానికి ప్రణాళిక
- రోజుకు 2.2 టీఎంసీల నీటిని సాగర్‌కు మళ్లించేలా ఎన్‌డబ్ల్యూడీఏ డీపీఆర్
- మొత్తం 230 టీఎంసీల్లో తెలంగాణకు 65, ఏపీకి 80, తమిళనాడుకు 84 టీఎంసీల కేటాయింపు
- ఏపీ చేపట్టిన 'బనకచర్ల'ను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో తాజాగా ఈ ప్రాజెక్టును ముందుకు తెచ్చిన తెలంగాణ





ఈ కబురు, న్యూఢిల్లీ: గోదావరి వరద జలాలను కృష్ణా బేసిన్‌కు తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ చేపట్టిన పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ.. గతంలో కేంద్రం ప్రతిపాదించిన ఇచ్చంపల్లి-నాగార్జునసాగర్ అనుసంధాన ప్రక్రియను మళ్లీ తెరపైకి తెచ్చింది. గోదావరి జలాలను వినియోగించదలిస్తే కేంద్రం సాయమందించే ఇచ్చంపల్లి-సాగర్ లింకు ప్రాజెక్టుపై చర్చించేందుకు తాము సిద్ధమని తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ మేరకు ఒక ప్రతిపాదనను తాజాగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ముందుంచారు. దీంతో నాలుగేళ్ల కిందట గోదావరి-కావేరి అనుసంధాన ప్రక్రియలో భాగంగా జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) తయారు చేసిన ఇచ్చంపల్లి-సాగర్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)పై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తరువాయి 2లో



# రేవంత్‌కు బేసిన్ల కంటే బ్యాగుల మీదే నాలెడ్జి ఎక్కువ

**నదుల బేసిన్లపై కనీస అవగాహన లేకుండా మాట్లాడారు**

**బనకచర్ల ప్రాజెక్టు ఏ నది బేసిన్‌లో కడుతున్నారో తెలియకపోతే ఎలా?**

**మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం**


**ఏపీ జలదోపిడీ, అక్రమ ప్రాజెక్టులు అడ్డుకోవడం చేతకాక అబద్ధాలు చెబుతున్నారు**

**తెలంగాణ హక్కులను ఏపీకి, చంద్రబాబుకు రాసిస్తే ప్రజలు ఊరుకోరు**


ఈ కబురు, హైదరాబాద్: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నదుల బేసిన్‌ల గురించి బేసిక్ నాలెడ్జ్ (కనీస అవగాహన) లేకుండా మాట్లాడారు. బేసిన్ (పరివాహక ప్రాంతం)ల కంటే కూడా బ్యాగుల మీదే నాలెడ్జి బాగా ఉన్నట్లు ఉంది. నదీ పరివాహక ప్రదేశాల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తమ అజ్ఞానాన్ని బయటపెట్టుకుంటూ రాష్ట్రం పరువు తీశారు..' అని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గోదావరి-బనకచర్లపై ఏపీ ప్రభుత్వం గత ఆరు నెలలుగా కేంద్ర మంత్రులను కలుస్తూ అనుమతులు కోరుతుంటే, కనీసం ఆ ప్రాజెక్టు ఏ నది బేసిన్‌లో కడుతున్నారో కూడా సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకోకపోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.

తరువాయి 2లో

## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు.. ఆటో షేర్లు మాత్రం అదుర్స్! » 4లో



## కియారా కోసం బెంగళూరు నుంచి ముంబయికి » 5లో



## విజయ్ దేవరకొండతో సినిమా.. కీర్తి సురేశ్ సమాధానం ఇదే! » 5లో



## బుమ్రా వరల్డ్ క్లాస్ బౌలరే.. కానీ!: బెన్ స్టోక్స్ » 6లో



# రూ.104 కోట్లతో

## వ్యవసాయ యాంత్రీకరణ పథకం



ఈ కబురు: రాష్ట్రంలో ఈ పంటకాలానికి సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణ పథకం వెంటనే ప్రారంభించాలని వ్యవసాయశాఖ అధికారులను మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. గురువారం ఒక ప్రకటనలో పేర్కొంటూ రైతులకు ఉపయోగకరమైన, డిమాండ్ ఉన్న పరికరాలను గుర్తించి, వాటిని సబ్సిడీపై అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలు, నియోజకవర్గాల వారిగా వ్యవసాయ పనిముట్లు, యంత్రాల కేటాయింపులు జరిపి, సరఫరా చేయాలని సూచించారు. ఈ పథకంలో సన్న, చిన్నకారు, మహిళా రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నమో డ్రోన్ దీదీ కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళసంఘాలకు అందించాలని పేర్కొన్నారు. కేంద్రం కేటాయించిన ఎరువులు, రాష్ట్రానికి సరఫరా అయిన ఎరువుల వివరాలపై ఆరా తీసి సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాలతో రోజు సంప్రదింపులు జరిపి రాష్ట్రానికి కేటాయించిన ఎరువులు సకాలంలో వచ్చేటట్లు అధికారులు కృషి చేయాలన్నారు. ఈ విషయంలో ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి జెపి నడ్డాకు లేఖ రాయడం జరిగిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో జులై వరకు సరిపడా ఎరువుల నిల్వలు ఉన్నాయని, ప్రస్తుతం ఆగస్టు మాసానికి సరిపడా ఎరువులను తెప్పించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

తరువాయి 2లో

# మెట్రో ఫేజ్ 2 మంజూరు చేయండి

**కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి**

**బ్రిటన్ మాజీ ప్రధాని బ్లెయిర్‌తో ముఖ్యమంత్రి భేటీ**


**'తెలంగాణ రైజింగ్ విజన్'పై బ్లెయిర్ సంస్థతో ఎంవోయూ**



ఈ కబురు, ఢిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టుకు సత్వరమే అనుమతి మంజూరు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సీఎం గురువారం ఇక్కడ కేంద్రమంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. "వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో రెండోదశ అవసరం చాలా ఉంది.

తరువాయి 2లో

# బనకచర్లను అడ్డుకోండి



**తెలంగాణ ప్రయోజనాలకు ఈ ప్రాజెక్టుతో విఘాతం**

**ఎలాంటి అనుమతులు, ఆర్థిక చేయూతనివ్వొద్దు**

**పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్, ఉత్తమ్ ఫిర్యాదు**

**గోదావరిలో 1,000, కృష్ణాలో 500 టీఎంసీల వినియోగానికి ఎన్‌వోసీ ఇవ్వండి**

**పాలమూరు–రంగారెడ్డి, సమ్మక్క–సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు, అన్ని అనుమతులు మంజూరు చేయండి**

ఈ కబురు, న్యూఢిల్లీ: తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీఫీజబిలిటీ నివేదికను తిరస్కరించాలని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్-1980 (జీడబ్ల్యూడీటీ), ఏపీ పునర్విభజన చట్టం-2014లకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని చెప్పారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జల్‌శక్తి మంత్రి పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో రేవంత్, ఉత్తమ్‌తోపాటు ఎంపీలు మల్లురవి, రఘువీర్ రెడ్డి, నీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళన నెలకొందని వివరించారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని.. జీడబ్ల్యూడీటీ-1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదన్నారు. 2014 ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని, అయితే బనకచర్ల విషయంలో ఏపీ వీటన్నింటిని ఉల్లంఘిస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలని రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కోరారు.వరద నిజమైతే ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధానంపై చర్చిద్దాం సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టిందని కేంద్ర మంత్రి పాటిల్‌కు రేవంత్, ఉత్తమ్ వివరించారు. గోదావరి అవార్డు ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని, తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు కొనసాగిస్తూనే ఉందని చెప్పారు.

తరువాయి 2లో

# భారత్, పాక్ యుద్ధం వాళ్లే ఆపేశారు.. తొలిసారి క్రెడిట్ కొట్టేయని ట్రంప్



ఈ కబురు: భారత్, పాక్ ఉద్రిక్తతలను ఆపింది ఆ రెండు దేశాలనేనని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు ఒప్పుకున్నారు. ఇన్నిరోజులుగా భారత్, పాక్ యుద్ధాన్ని తనే ఆపానని ప్రచారం చేసుకున్న ట్రంప్.. ఇరుదేశాల నాయకులు చాలా తెలివైన వారని, పరిస్థితి అణుయుద్ధం వరకు వెళ్లకముందే యుద్ధం ముగించారని అన్నారు. తన ఓవల్ ఆఫీసులో పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌తో లంచ్ అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మునీర్‌ను కలవడం చాలా గౌరవంగా ఉందన్న ఆయన.. ఇరాన్ గురించి కూడా మునీర్‌తో చర్చించినట్లు వెల్లడించారు. 'ఇరాన్ గురించి పాక్‌కు చాలా విషయాలు తెలుసు.

» 2లో

**జగన్ ఏం నేర్పుతున్నారు?**

**రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేదే ఆయన ఆలోచన**

**అందుకే రెచ్చగొడుతున్నారు.. హింసను ప్రేరేపిస్తున్నారు**

**గంజాయి, బెట్టింగ్ బ్యాచ్‌లకు పరామర్శలు.. విగ్రహాలా?**

**దేశంలో ఏ రాజకీయ నేతైనా.. పోయి నరకండ్రా అని రెచ్చగొడతారా**

**జగన్‌పై నిప్పులు చెరిగిన చంద్రబాబు**


# హత్యలు చేయొచ్చని చెబుతున్నారా?

**చంపేస్తాం, రప్పా రప్పా నరికేస్తాం.. గంగమ్మ జాతరలో బలిచ్చేస్తాం.. అని ప్లకార్డులు ప్రదర్శిస్తుంటే చూస్తూ ఆనందపడిపోతారా? సమాజానికి ఏం నేర్పుతున్నారు? ఇలాంటి పోకడలు ఎప్పుడైనా చూశామా? దేశంలో ఎక్కడైనా ఏ రాజకీయ నాయకుడైనా, పార్టీ అయినా ఇలా చేస్తాయా? ఎవరైనా పోయి నరకండ్రా అని చెబుతారా? సినిమాల్లో మనుషుల్ని చంపడం కూడా చూపిస్తుంటారు. అలాగని చంపితే తప్పేంటనేది జగన్ ఉద్దేశమా? జగన్ లాంటి వాళ్లు రోడ్డు మీదకు వస్తే.. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులొస్తాయి.**

**- సినిమా డైలాగులతో ప్లకార్డులు పెట్టడమూ తప్పేనా అంటూ జగన్ గురువారం చేసిన వ్యాఖ్యలపై చంద్రబాబు స్పందన**

ఈ కబురు, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్‌కు పరిశ్రమలు, పెట్టుబడిదారులు రాకూడదు, అభివృద్ధి కాకూడదు, ఆదాయం రాకూడదు, ఏ పని జరగకూడదు, ఏ ప్రాజెక్టు కట్టకూడదనేదే జగన్ ఆలోచన. అందుకే రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు.. హింసను ప్రేరేపిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వెలిబుచ్చారు. 'యోగాపై రాష్ట్రమంతా సానుకూల వాతావరణం ఉంటే.. దాన్ని పాడు చేయాలనేది ఆయన ఉద్దేశం.. నేరగాళ్లకే ఆ రకమైన ఆలోచనలు వస్తుంటాయి. కూటమి ఇచ్చిన హామీలపై ప్రజలు అడిగితే సమాధానం చెప్పడానికి సిద్ధం. అన్యాయం జరిగితే సరిదిద్దుతాం' అని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై గురువారం ఆయన సచివాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

తరువాయి 2లో




# డెత్ స్పాట్ గా సీక్రెట్ లేక్..

**కేబుల్ బ్రిడ్జి పైనుంచి దుర్గం చెరువులో దూకి మహిళ ఆత్మహత్య**

**అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులే కారణం**



»3లో

మొదటి పేజీ తరువాయి

# మళ్లీ తెర పైకి ఇచ్చంపల్లి-సాగర్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ మేరకు ఒక ప్రతిపాదనను తాజాగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ముందుంచారు. దీంతో నాలుగేళ్ల కిందట గోదావరి-కావేరి అనుసంధాన ప్రక్రియలో భాగంగా జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) తయారు చేసిన ఇచ్చంపల్లి-సాగర్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)పై దృష్టి పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.
మొత్తం 247 టీఎంసీల మళ్లింపు ఎన్‌డబ్ల్యూడీఏ 2020-21లో రూపొందించి సంబంధిత రాష్ట్రాలకు అందజేసిన డీపీఆర్‌లో..ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధాన ప్రాజెక్టు, జలాల లభ్యత, మళ్లించే విధానం, అవసరమయ్యే నిధులు, ఆయా రాష్ట్రాలకు దక్కే నీటి వాటాలు, వృద్ధిలోకి వచ్చే ఆయకట్టు తదితర అంశాలను స్పష్టంగా పేర్కొంది. దీని ప్రకారం.. తెలంగాణలోని ఇచ్చంపల్లి వద్ద గోదావరి నదిపై 15.8 టీఎంసీల సామర్థ్యంతో బరాజ్ నిర్మించి తమిళనాడులో కావేరి నదిపై ఉన్న గ్రాండ్ ఆనకట్ట వరకు 247 టీఎంసీల నీటిని మళ్లిస్తారు.
బరాజ్ నుంచి రోజుకు 2.2 టీఎంసీల చొప్పున నీటిని సాగర్‌కు మళ్లిస్తారు. ఈ దారిలో గొట్టిముక్కల బ్రాంచి కాలువ కింద నల్లగొండ జిల్లాలోని మునుగోడు, చండూరు ప్రాంతాల్లో 80 వేల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు, ఎస్సారెస్పీ-2 కింద 1.78 లక్షలు, ఎస్ఎల్‌బీసీ కింద 1.09 లక్షల హెక్టార్లకు నీరందించాల్సి ఉంటుంది. ఇక ఏపీలో సాగర్ కుడి కాలువ కింద 1.26 లక్షల హెక్టార్లు, నాగార్జునసాగర్-సోమశిల కింద 1.68 లక్షల హెక్టార్ల కొత్త ఆయకట్టుకు నీటిని ప్రతిపాదించారు. సోమశిల-కావేరి మధ్య 2.5 లక్షల హెక్టార్లకు నీటి సరఫరాకు సంబంధించిన ప్రతిపాదనలు కూడా ఇందులో ఉన్నాయి.

**మూడు రాష్ట్రాలకు 230 టీఎంసీలు**

గోదావరిలో వరద ఉండే జూన్-అక్టోబర్ నెలల్లో 143 రోజుల్లో 247 టీఎంసీలను మళ్లిస్తారు. ఇందులో ఆవిరి నష్టాలు పోనూ మిగిలే 230 టీఎంసీలలో తెలంగాణ 65, ఆంధ్రప్రదేశ్ 79.9, తమిళనాడు 84 టీఎంసీలు వినియోగించుకునేలా ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టుకు ఆ సమయంలోనే రూ.85 వేల కోట్ల మేర వ్యయాన్ని అంచనా వేసింది.
ఇచ్చంపల్లి నుంచి సాగర్‌కు నీటిని మళ్లించే క్రమంలో మూడు లిఫ్టులు నిర్మించాల్సి ఉండగా, వీటి నిర్వహణకు 3,840 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరమవుతుందని, ఇందుకు ఏటా రూ.770 కోట్ల ఖర్చవుతుందని లెక్కగట్టింది. ఇక ఇచ్చంపల్లి వద్ద నిర్మించే బరాజ్‌తో 9,300 హెక్టార్లు ముంపునకు గురికానుండగా, 22 వేల మంది నిరాశ్రయులవుతారని ఎన్‌డబ్ల్యూడీఏ పేర్కొంది. అయితే ఈ ప్రతిపాదనను అప్పట్లో తెలంగాణ వ్యతిరేకించింది. దీనికి దిగువన అకినేపల్లి నుంచి ఒక ప్రతిపాదన, తుపాకులగూడెం నుంచి మరో ప్రతిపాదన, దుమ్ముగూడెం నుంచి ఇంకో ప్రతిపాదన సిద్ధం చేశారు. అయితే ఇంద్రావతి మిగులు జలాలపై ఛత్తీస్‌గఢ్ అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో దీనిపై చర్చోపచర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ పోలవరం-బనకచర్ల చేపట్టడంతో, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తెలంగాణ తాజాగా ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధానాన్ని తెరపైకి తెచ్చింది. దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందన్నది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

మొదటి పేజీ తరువాయి

# మెట్రో ఫేజ్-2 మంజూరు చేయండి



ఈ కబురు, ఢిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టుకు సత్వరమే అనుమతి మంజూరు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సీఎం గురువారం ఇక్కడ కేంద్రమంత్రిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. "వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో రెండోదశ అవసరం చాలా ఉంది. రూ.26,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇది కార్యరూపం దాలిస్తే నగరంలో రాకపోకలు వేగంగా సాగుతాయి. రహదారులపై రద్దీ తగ్గుతుంది. పర్యావరణ, సుస్థిరాభివృద్ధికి ఇది ఎంతో దోహదం చేస్తుంది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సూచనల మేరకు డీపీఆర్‌లో అవసరమైన సవరణలు చేసి సమర్పించాం. ఈ ప్రాజెక్టుకున్న అత్యవసరతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచీ అవసరమైన అనుమతులు ఇప్పించండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రికి విన్నవించారు.

**'తెలంగాణ రైజింగ్'కు టోనీ బ్లెయిర్ అభినందన**

సీఎం రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో యునైటెడ్ కింగ్‌డమ్ మాజీ ప్రధానమంత్రి టోనీబ్లెయిర్‌తో భేటీ అయ్యారు. 1997 2007 మధ్య యూకే ప్రధానిగా పనిచేసిన అనంతరం రాజకీయాల నుంచి వైదొలగిన బ్లెయిర్.. టోనీబ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ ఛేంజ్ (టీబీఐజీసీ)ను స్థాపించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల నాయకులకు విజన్, వ్యూహాల రచన, వాటి అమలులో సహకరించడం దీని లక్ష్యం. ఇలా భారత్‌లోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించడానికి బ్లెయిర్ ఢిల్లీకి వచ్చిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆయనతో భేటీ అయ్యారు. సుమారు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో.. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యంలోని కీలకాంశాలను బ్లెయిర్‌కి ముఖ్యమంత్రి వివరించారు. ఈ విధానపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవమైన డిసెంబరు 9న విడుదల చేయబోతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాల గురించి వివరించారు. రైతులు, యువత, మహిళల ఆర్థికాభివృద్ధితో పాటు, మానవాభివృద్ధి సూచికలను మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యల గురించి చెప్పారు. రాష్ట్రాన్ని పట్టణ, శివారు, గ్రామీణ జోన్లుగా విభజించి సూక్ష్మప్రణాళికలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికలను బ్లెయిర్ అభినందించారు. భారత్ ఫ్యూచర్‌సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీల గురించి ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. 'తెలంగాణ రైజింగ్ విజన్' రూపకల్పనతోపాటు, దాని అమలులో పాలుపంచుకోవడానికి టీబీఐజీసీ, తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ సమావేశాల్లో రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీలు మల్లురవి, రఘువీర్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక పెట్టుబడుల విభాగం సీఈఓ జయేశ్‌రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, టీబీఐజీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# రేవంత్‌కు బేసిన్ల కంటే బ్యాగుల మీదే నాలెడ్జి ఎక్కువ

'రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడారు. అంతులేని అజ్ఞానంతో మూర్తీభవించిన మూర్ఖత్వంతో మాట్లాడారు. దేవాదుల ఏ బేసిన్‌లో ఉందో తెలియదు. బనకచర్ల ఏ బేసిన్‌లో కడుతున్నారో తెలియదు. ఇవేవీ తెలుసుకోకుండా సీఎం ఏం చేస్తున్నట్లు..?' అంటూ మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**రాష్ట్ర ప్రయోజనాలు పక్కనపెట్టి రాజకీయాలా?**

'తెలంగాణ నీటిపారుదల ప్రాజెక్టులపై సీఎం రేవంత్‌కు అవగాహన, చిత్తశుద్ధి లేదని బుధవారం ఆయన ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో తేలిపోయింది. నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ కూడా బనకచర్ల ప్రకాశం జిల్లాలో ఉందని చెప్పడం విడ్డూరంగా ఉంది. బనకచర్ల విషయంలో మొద్దు నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ అప్రమత్తం చేస్తే, సీఎం మాత్రం రాష్ట్ర ప్రయోజనాలు పక్కనపెట్టి రాజకీయాలు మాట్లాడుతున్నాడు.
ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో.. 'ఈ భేటీని రాజకీయ వేదికగా మార్చకు..బనకచర్ల ఆపాలి' అని మా రవిచంద్ర అంటే సీఎం అబద్ధాలకు వేదికగా మార్చారు. ఏపీ జలదోపిడీ, అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవడం చేతకాని సీఎం చెప్తున్న అబద్ధాలకు అంతు ఉండటం లేదు. రేవంత్‌రెడ్డి కుసంస్కారి.. వదరుబోతు. ఆయన నల్లమల పులిబిడ్డ కాదు..వెకిలి మాటల వెర్రిబిడ్డ. మేం ఉద్యమాల నుంచి వచ్చినం. నీలాగా అడ్డమైన తొక్కులు తొక్కుతూ రాలేదు..' అంటూ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఏపీకి రేవంత్ దాసోహం అవుతున్నారు..**


'గోదావరిలో 1,000, కృష్ణా నదిలో 500 టీఎంసీలు తెలంగాణకు తీసుకుని, మిగిలిన జలాలను ఏపీకి తరలించుకునేందుకు ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలంగాణ ఆయన జాగీరు కాదు. చంద్రబాబు దయాదాక్షిణ్యాల మీద బతకడాన్ని రేవంత్ మానుకోలేక పోతున్నారు. ఏపీకి దాసోహం అవుతూ బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. రేవంత్ చేసిన ద్రోహానికి ఆయనను ఉరి తీసినా తప్పులేదు. నదీ జలాల్లో తెలంగాణ హక్కులను ఏపీకి, చంద్రబాబుకు రాసిస్తే ప్రజలు ఊరుకోరు. చంద్రబాబుకు రేవంత్‌కు మధ్య ఆదిత్యనాథ్ దాస్ అనుసంధాన కర్తగా పనిచేస్తున్నాడు. గోదావరి, కృష్ణా జలాలు ఏపీకి దోచి పెట్టేందుకు అవి రేవంత్ అయ్య సొమ్ము కాదు. ఆయన కేవలం తెలంగాణకు కాపలాదారు మాత్రమే..' అని మాజీమంత్రి అన్నారు.

**మేం అంగీకరించామనడం శుద్ధ అబద్ధం**

'తెలంగాణకు సాగునీటి కోసం పరితపించిన కేసీఆర్ రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన నీటి వాటా కోసం సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. పోలవరం ద్వారా పెన్నా బేసిన్‌కు నీరు తరలిస్తే కృష్ణా బేసిన్‌లో 763 టీఎంసీలు తెలంగాణకు రావాలని గతంలో అఫిడవిట్ ఫైల్ చేశాం. గోదావరిలో సగటున ఏటా 3 వేలకు పైగా టీఎంసీలు సముద్రంలో కలుస్తాయని సీడబ్ల్యూసీ లెక్కల ఆధారంగా కేసీఆర్ అంచనా వేసి అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో ప్రస్తావించారు.
కానీ రేవంత్‌రెడ్డి వాస్తవాలను వక్రీకరించి బనకచర్లకు గత ప్రభుత్వం అంగీకరించినట్లు అబద్ధాలు చెప్తున్నారు. తెలంగాణను సంప్రదించకుండా గోదావరి, కృష్ణా నదుల అనుసంధానం చేపడితే అంగీకరించేది లేదని గతంలోనే అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ కుండబద్ధలు కొట్టారు. కానీ రేవంత్ మాత్రం 1,000 టీఎంసీలు తెలంగాణకు ఇచ్చి, మీరు ఎన్ని జలాలు అయినా తరలించుకోండి అని ఏపీకి చెప్తున్నారు..' అని హరీశ్‌రావు ఆరోపించారు.

**ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోం..**

'కృష్ణా-గోదావరి నదీ జలాల అనుసంధానం గురించి కేసీఆర్ చేసిన ప్రతిపాదనకు గతంలో ఏపీ సీఎం జగన్ అంగీకరించక పోవడంతో అది ముందుకు సాగలేదు. తెలంగాణతో సంబంధం లేకుండా కృష్ణా-గోదావరి అనుసంధానికి అంగీకరించే ప్రసక్తే లేదు. గోదావరి జలాల్లో తెలంగాణకు హక్కుగా రావాల్సిన ఒక్క నీటి చుక్కను కూడా వదులుకోం. అవసరమైతే రైతుల పక్షాన కోర్టులను ఆశ్రయిస్తాం..' అని హరీశ్‌రావు ప్రకటించారు. మీడియా సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, అనిల్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మొదటి పేజీ తరువాయి

# రూ. 104 కోట్లతో వ్యవసాయ యాంత్రీకరణ పథకం



**ఎన్నడు లేని విధంగా జోన్నల సేకరణ : మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పొద్దుతిరుగుడు, జొన్న వివరాలు, రైతుల చెల్లింపులపై వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఎన్నడూ లేని విధంగా ఈ సారి 1,55,257 మెట్రిక్ టన్నుల జొన్నలను మార్క్ ఫెడ్ ద్వారా సేకరించి, దీనికి సంబంధించి 91 వేల మెట్రిక్ టన్నులకు రూ. 302 కోట్లను రైతులకు చెల్లించినట్లు తెలిపారు. పొద్దతిరుగుడు సంబంధించి 4,333 టన్నులు సేకరించగా, అందుకు సంబంధించిన రూ. 31 కోట్లను రైతులకు చెల్లించామన్నారు. గత ప్రభుత్వంలో అత్యధికంగా 35 వేల మెట్రిక్ టన్నుల జొన్నలను మాత్రమే మార్క్ ఫెడ్ ద్వారా సేకరించగా, దానికి మూడింతలు మా ప్రభుత్వం సేకరించినట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్ధతు ధరలు నిర్దేశించే వ్యవసాయ ఖర్చులు ధరల కమిషన్ దక్షిణ ప్రాంతీయ సమావేశం శుక్రవారం మారిగోల్డ్ హోటల్లో నిర్వహించనున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాల నుండి వ్యవసాయ శాఖ అధికారులు, ప్రతినిధులు పాల్గొని, వారి సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున కూడా పెరిగిన సాగు ఖర్చులను ప్రతిబింబింప చేసి రైతులకు ఇచ్చే మద్దతు ధరలను డా. స్వామినాథన్ కమిటీ సిఫారస్ ల మేరకు సీఏసీపి కేంద్ర ప్రభుత్వానికి సూచించేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.**

# బనకచర్లను అడ్డుకోండి

గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఏపీ భావిస్తుంటే పోలవరం-బనకచర్లకు బదులు, కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి-నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధమని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తాము ఎట్టిపరిస్థితుల్లో రాజీపడబోమని, అన్ని వేదికల ద్వారా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కేంద్రం స్పందన సానుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సీఎం స్పష్టం చేశారు.

1,500 టీఎంసీలను వాడుకునేలా..

తెలంగాణకు గోదావరి నదిలో 1,000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు మొత్తంగా 1,500 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర జల్‌శక్తి శాఖ, ఏపీ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని, దానికి కేంద్రం ఆమోదం తెలపాలని సీఆర్ పాటిల్‌కు రేవంత్ విజ్ఞప్తి చేశారు. 1500 టీఎంసీల నీటితో కోటి న్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఏపీ చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతు ల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదని సీఎం రేవంత్ అన్నారు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నా రు. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడి హెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతోపాటు అన్ని రకా ల అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవానికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి పాటిల్‌కు రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.


# భారత్, పాక్ యుద్ధం వాళ్లే ఆపేశారు.. తొలిసారి క్రెడిట్ కొట్టేయని ట్రంప్

ఈ కబురు: భారత్, పాక్ ఉద్రిక్తతలను ఆపింది ఆ రెండు దేశాలనేనని యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎట్టకేలకు ఒప్పుకున్నారు. ఇన్నిరోజులుగా భారత్, పాక్ యుద్ధాన్ని తనే ఆపానని ప్రచారం చేసుకున్న ట్రంప్.. ఇరుదేశాల నాయకులు చాలా తెలివైర వారని, పరిస్థితి అణుయుద్ధం వరకు వెళ్లకముందే యుద్ధం ముగించారని అన్నారు. తన ఓవల్ ఆఫీసులో పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌తో లంచ్ అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మునీర్‌ను కలవడం చాలా గౌరవంగా ఉందన్న ఆయన.. ఇరాన్ గురించి కూడా మునీర్‌తో చర్చించినట్లు వెల్లడించారు. 'ఇరాన్ గురించి పాక్‌కు చాలా విషయాలు తెలుసు.అయితే వాళ్లు కూడా చాలా విషయాల్లో సంతోషంగా లేరు. వాళ్లకు ఇజ్రాయెల్ గురించి కూడా బాగానే తెలుసు' అని ట్రంప్ చెప్పారు. భారత్‌తో యుద్ధానికి వెళ్లనందుకు మునీర్‌ను లంచ్‌కు ఆహ్వానించానని, భారత ప్రధాని మోడీకి కూడా ధన్యవాదాలు చెప్పాలని అనుకుంటున్నానని తెలిపారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నామని, పాక్‌తో కూడా ట్రేడ్ డీల్ చేసుకుంటామని చెప్పారు. 'కొన్ని వారాల క్రితం మోడీ కూడా ఇక్కడకు వచ్చారు. ఈ రెండు దేశాల నేతలు చాలా తెలివైనవాళ్లు. వాళ్ల స్టాఫ్ కూడా మంచి తెలివికలవారే. పరిస్థితి అణుయుద్ధం వరకు వెళ్లకముందే యుద్ధాన్ని ఆపేయాలని వాళ్లు నిర్ణయించుకున్నారు. ఈ రెండు దేశాలు చాలా పెద్ద న్యూక్లియర్ పవర్స్. అలాంటి దేశాలు ఈ నిర్ణయం తీసుకోవడం చాలా గొప్ప విషయం' అని ట్రంప్ చెప్పుకొచ్చారు. మే 10న భారత్, పాక్ మధ్య కాల్పుల విమరణ ఒప్పందం జరిగినప్పటి నుంచి తనే ఈ యుద్ధాన్ని ఆపానని ట్రంప్ పలుమార్లు చెప్పుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు సడెన్‌గా ఈ రెండు దేశాలే యుద్ధాన్ని ఆపాయని ట్రంప్ చెప్పడం గమనార్హం.



మొదటి పేజీ తరువాయి

# హత్యలు చేయొచ్చని చెబుతున్నారా?



ఈ కబురు, అమరావతి: 'ఆంధ్రప్రదేశ్‌కు పరిశ్రమలు, పెట్టుబడిదారులు రాకూడదు, అభివృద్ధి కాకూడదు, ఆదాయం రాకూడదు, ఏ పని జరగకూడదు, ఏ ప్రాజెక్టు కట్టకూడదనేదే జగన్ ఆలోచన. అందుకే రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు.. హింసను ప్రేరేపిస్తున్నారు' అని సీఎం చంద్రబాబు ఆగ్రహం వెలిబుచ్చారు. 'యోగాపై రాష్ట్రమంతా సానుకూల వాతావరణం ఉంటే.. దాన్ని పాడు చేయాలనేది ఆయన ఉద్దేశం.. నేరగాళ్లకే ఆ రకమైన ఆలోచనలు వస్తుంటాయి. కూటమి ఇచ్చిన హామీలపై ప్రజలు అడిగితే సమాధానం చెప్పడానికి సిద్ధం. అన్యాయం జరిగితే సరిదిద్దుతాం' అని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై గురువారం ఆయన సచివాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'ఒకప్పుడు నేరప్రవర్తన కలిగినవారితో మాట్లాడాలంటేనే భయపడేవాళ్లం. పక్కకు కూడా రానిచ్చేవాళ్లం కాదు. ఇప్పుడు వాళ్లతోనే రాజకీయం చేసే పరిస్థితి వచ్చింది. ఇది చాలా ప్రమాదకరం. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నో పనుల్ని రద్దుచేశారు. అమరావతి, పోలవరం సహా మరెన్నో విధ్వంసాలు చేశారు..కూటమి ప్రభుత్వం వచ్చాక వైకాపా ప్రభుత్వంలో ఇచ్చిన పనుల్ని రద్దు చేయలేదు. వాటిని సరిదిద్దాం. ప్రజాహితమే లక్ష్యంగా పనిచేస్తున్నాం' అని చంద్రబాబు చెప్పారు.

ఏడాదిగా.. జగన్‌కు ఎప్పుడైనా అడ్డు చెప్పామా?

'వైకాపా ప్రభుత్వంలో పోలీసులు వద్దని చెబితే మేం ఎక్కడకూ వెళ్లలేదు. గ్రామాల్లోకి రెండు కార్లలో వెళ్తామన్నా వెళ్లనివ్వలేదు. విశాఖపట్నం, తిరుపతి విమానాశ్రయాల్లో నన్ను నిలిపేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాది నుంచి జగన్‌ను ఎక్కడికైనా వెళ్లకుండా ఆపామా? ఎవరైనా అడ్డుచెప్పారా? పరామర్శ ఉందంటే 3 కార్లకు, 100 మందితో కలిసి వెళ్లేందుకు అనుమతిస్తే చాలదా? ఇంకేం కావాలి? జగన్ ఎక్కడకు వెళ్తే అక్కడ గొడవ చేస్తున్నారు. ఇది పనికిరాని ప్రభుత్వం అని చెప్పాలనే ప్రయత్నం కాక మరేంటి? తనలాగే అంతా రౌడీయిజం చేయాలని మార్గం చూపిస్తున్నారు. ఇరుకు సందుల్లోకి పోయి సమావేశాలు పెట్టడం, తొక్కిసలాటలు జరగడం, తర్వాత హింసను ప్రేరేపించడం.. మళ్లీ పోలీసులపై బురదజల్లడం.. ఏంటివన్నీ? హుందాతనం ఉందా?' అని నిలదీశారు.

జగన్ మారాలి.. లేదంటే మార్చాలి

'వైకాపా ప్రభుత్వ హయాంలో అరాచకాలు జరిగాయా లేదా? ఇసుక, మద్యంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు..రాజకీయాల్లో ఉన్నప్పుడు ఏం చేసినా చెల్లుతుందని.. చర్యలే తీసుకోకూడదంటే ఎలా? ఉద్దేశపూర్వకంగా అరెస్టులు ఎందుకు చేస్తారు? చట్టం తన పని తాను చేస్తుంది. వీటిపై పత్రికల్లో రాస్తే సమాజ వ్యతిరేకులుగా చిత్రీకరిస్తారు. ఆయనైనా (జగన్) మారాలి. లేదంటే మార్చాలి. అలా చేయకుంటే రాష్ట్రానికి రక్షణ ఉండదు. తప్పుడు పనులు చేస్తూ సమాజాన్ని అతలాకుతలం చేస్తామంటే ఉపేక్షించం' అని హెచ్చరించారు.

జగన్ లాంటి వాళ్లను ఆదర్శంగా తీసుకునే కుప్పం ఘటన

'కుప్పం నియోజకవర్గంలో జరిగిన ఘటనకు సిగ్గుపడుతున్నా. డబ్బు ఇవ్వకపోతే చెట్టుకు కట్టేసి కొడతారా? జగన్ లాంటివాళ్లను ఆదర్శంగా తీసుకుంటున్నారు. బుధవారం మరో ఇద్దరు వైకాపా వాళ్లు కొట్టుకున్నారు. ఇలాంటివారు సమాజానికి పెద్ద సమస్యగా మారుతున్నారు. ఉన్మాదుల్లా తయారయ్యారు' అని చంద్రబాబు మండిపడ్డారు.

కేంద్రం ఇచ్చిన ఆక్సిజన్‌తోనే

'కేంద్రం అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరానికి రూ.12,500 కోట్లు, స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,500 కోట్లు ఇచ్చింది కాబట్టే అది రాష్ట్రానికి ఆక్సిజన్‌గా పనిచేసింది. కొన్ని పనులు జరుగుతున్నాయి. ఏడాదిలో 25 ఎస్ఐపీబీ సమావేశాలు నిర్వహించాం. 25 క్యాబినెట్ సమావేశాలు నిర్వహించి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతిచ్చాం' అని పేర్కొన్నారు.
గంజాయి, బెట్టింగ్ బ్యాచ్, రౌడీలు, హత్యలు, అత్యాచారాలు చేసేవారిని పరామర్శిస్తూ.. విగ్రహాలు పెడుతూ రాజకీయాల్లో కొత్త విధానాలు తెస్తున్నారు. రౌడీయిజం చేసేవారు, ఊళ్లో భయభ్రాంతులకు గురిచేసేవాళ్లు వాళ్ల దృష్టిలో హీరోలు.. శాంతిభద్రతలు కాపాడే వాళ్లను చేతగాని వాళ్లనే పరిస్థితి తెస్తున్నారు.బెట్టింగ్ కారణంగా ఏడాది కిందట చనిపోయిన వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్తారా? ఆ సమయంలో ఇద్దరు చనిపోతే కనీసం వారిని చూడరా? బెట్టింగ్ గొడవలతో చనిపోయిన ప్రాణానికి ఉన్న విలువ.. వాళ్లు చంపినవారికి లేదా? వారిది ప్రాణం కాదా? వారు మనుషులు కాదా? ప్రకాశం జిల్లా పొదిలిలో పొగాకు వేలం కేంద్రానికి 40వేల మందితో వెళ్లాల్సిన అవసరం ఏంటి? అక్కడ శాంతిభద్రతల సమస్య సృష్టించడానికి కాక మరెందుకు? అంతమందితో వెళ్తే అక్కడున్న పొగాకు ఏమవుతుంది? రైతులు ఏమవుతారు? అంటే ఏం చేసినా ఊరుకోవాలా? ఇంగితం ఉండొద్దా?

# డెత్ స్పాట్ గా సీక్రెట్ లేక్..

## కేబుల్ బ్రిడ్జి పైనుంచి దుర్గం చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

## అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులే కారణం



దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జీ



ఆత్మహత్య చేసుకున్న సుష్మ (ఫైల్)



దుర్గం చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న డీఆర్ఎఫ్, పోలీసు సిబ్బంది

ఈ-కబురు, శేరిలింగంపల్లి : హైటెక్ సిటీలో చిన్న చిన్న గుట్టల మధ్యగా... కిలోమీటర్ల పొడవు విస్తరించి.. సీక్రెట్ లేక్ గా పేరుగాంచిన దుర్గం చెరువు డెత్ స్పాట్ గా మారుతుంది. దుర్గం చెరువు అందాలను విశ్వవ్యాప్తం చేసేందుకు కేబుల్ బ్రిడ్జిని ఏర్పాటు చేసి ప్రభుత్వం టూరిస్ట్ స్పాట్ గా మార్చగా, కొందరు మాత్రం కేబుల్ బ్రిడ్జిని ఆత్మహత్యలకు కేంద్రంగా మార్చుకుంటున్నారు. కేబుల్ బ్రిడ్జి ప్రారంభించిన నాటి నుంచి తరచూ క్రమం తప్పకుండా ఆత్మహత్యల సంఘటనలు చోటుచేసుకోవడం విషాదాన్ని నింపుతుంది. తాజాగా అదనపు కట్నం కోసం అత్తింటి వారి వేధింపులు భరించలేక ఓ మహిళ కేబుల్ బ్రిడ్జి మీద నుంచి దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటన కు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం...

ఈస్ట్‌మారేడ్‌పల్లిలోని అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన అంజయ్య కుమార్తె బి. సుష్మ(27)కు నెరేడ్‌మెట్‌కు చెందిన గొల్లూరు ఆనంద్, పాలిన దంపతుల కుమారుడు అమృత్‌తో 2025 జనవరి 31వ తేదిన వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం కింద 6 తులాల బంగారం, ఒప్పుకున్న 6లక్షల నగదులో 5.50 లక్షలు ఇచ్చారు. అమృత్ హైటెక్‌సిటీలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, సుష్మ మాదాపూర్ ఇనార్బిట్ మాల్ రోడ్డులోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంది. గత కొద్ది రోజులుగా అదనపు కట్నం తీసుకురావాలని సుష్మను భర్త అమృత్, అత్తమామలు ఆనంద్, పాలిన, మరిది జ్యోతిరాజ్ వేధింపులకు గురిచేశారు. కట్నం విషయమై సుష్మకు అత్తమామలతో గొడవలు జరిగాయి. ఇటీవల సుష్మకు ఆరోగ్యం బాగలేకపోవడంతో గత శని, ఆదివారం ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని సోమవారం అడ్డగుట్టలోని తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. తల్లిదండ్రుల వద్ద ఉన్న సుష్మ ఈ నెల 18వ తేదిన సాయంత్రం 3 గంటలకు ఆఫీస్‌కు వెళ్తున్నాని ఇంట్లో నుండి బయటకు వచ్చింది. అఫీస్‌కు చేరుకున్న సుష్మ రాత్రి 8. 30 గంటలకు బయటకు వెళ్లింది. అక్కడి నుండి కేబుల్ బ్రిడ్జి మీదకు చేరుకొని దుర్గం చెరువులోకి దూకింది. రాత్రి1 గంట ప్రాంతంలో ఇంటికి రావలసిన సుష్మ రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. అఫీస్ మేనేజర్‌కు తండ్రి ఫోన్ చేసి వాకబు చేయగా, రాత్రి 8.30 గంటలకే అఫీస్ నుండి బయటకు వెళ్లిందని తెలియజేశాడు. దీంతో తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద సుష్మ అచూకీ కోసం వెతికిన తల్లిదండ్రులు ఫలితం లేకపోవడంతో గురువారం తెల్లవారుజామున మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఉదయం 7 గంటల సమయంలో దుర్గం చెరువు నీటిపై యువతి మృతదేహం తేలియాడుతుండడంతో స్థానికులు గమనించి మాదాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయంతో యువతి మృతదేహాన్ని చెరువు నుండి బయటకు తీసి చూడగా, మృతురాలిని మిస్సింగ్ అయిన సుష్మగా గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించి పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుష్మ భర్త అమృత్, తల్లిదండ్రులు ఆనంద్ పాలిన, మరిది జ్యోతిరాజ్ లపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



చిన్నారులతో కలిసి వేడుకల్లో చంద్రికా ప్రసాద్

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

**రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్న దేశ ప్రజలు : చంద్రికా ప్రసాద్ గౌడ్**

ఈకబురు, శేరిలింగంపల్లి : కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మియాపూర్ లో ఘనంగా నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షురాలు పి.చంద్రికా ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో మియాపూర్ ఓంకార్ నగర్ వికర్ సెక్షన్ కాలనీలో ఉన్న స్వచ్ఛంద సంస్థ స్కూల్ లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా చంద్రికా ప్రసాద్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ 55వ జన్మదిన వేడుకలను ఓంకార్ నగర్ స్కూల్లో జరుపుకోవడం ఆనందంగా ఉందని ఈ స్కూల్ ఆర్థికంగా అత్యంత వెనుకబడిన చిన్నారులు చదువుకుంటున్నారని అన్నారు. నేడు దేశ ప్రజలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధిస్తుందన్నారు. సంక్షేమానికి మారుపేరు కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు.

# సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావుపై కేసు..

**ప్లాట్ల యజమానులపై దాడి ఘటనలో గచ్చిబౌలి పోలీసుల చర్యలు**

**శ్రీధర్ రావు, అనుచరుడు వెంకటేష్, మరో ముగ్గురిపై కేసులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావుపై గచ్చిబౌలి పోలీసు స్టేషన్ లో మరో కేసు నమోదైంది. ఎఫ్సీఐ లే ఔట్ ప్లాట్ల యజమానులను బెదిరించి దాడి చేసిన ఘటనలో ప్లాట్ల యజమానుల పిర్యాదు మేరకు పోలీసులు శ్రీధర్ రావుతో పాటు అతని అనుచరుల మీద కేసు నమోదు చేశారు. ఈ కేసు కు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. శేరిలింగంపల్లి మండల పరిధిలోని గచ్చిబౌలి సర్వే నెంబర్ 124,125లలో ఉన్న ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా హౌసింగ్ సొసైటీలో ఈ నెల 17వ తేదీన హైడ్రా అధికారులు సర్వే, రహదారుల మార్కింగ్ పనులు చేపట్టారు. మణికొండలో నివాసం ఉండే కుషిచంద్ వడ్డే(40)కు ఈ లే ఔట్ లో ప్లాట్ ఉంది. సర్వే విషయమై హైడ్రా అధికారులు కుషిచంద్ వడ్డేకు సమాచారం అందించారు. దీంతో కుషిచంద్ ఎఫ్‌సీఐ లేఔట్ వద్దకు చేరుకున్నాడు. సర్వే సమయంలో సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు, అతని అనుచరుడు వెంకటేష్ అక్కడే ఉన్నారు. ప్లాట్ల కబ్జా విషయమై కుషిచంద్ గతంలో శ్రీధర్ రావు మీద పోలీసులకు పిర్యాదు చేశాడు. ఈ క్రమంలో సర్వే వద్ద కుషిచంద్ ను చూసిన శ్రీధర్ రావు అనుచరుడు వెంకటేష్‌కారుతో స్పీడ్‌గా దూసుకువచ్చి కుషిచంద్ ను ఢీకొట్టేందుకు యత్నించగా, వెంటనే స్పందించిన కుషిచంద్ కారు దిగి తప్పించుకున్నాడు. వెంకటేష్ కారు దిగి వచ్చి కుషిచంద్ ను బూతులు తిడుతూ మొఖంపై పిడిగుద్దుల వర్షం కురిపించాడు. సంఘటన స్థలంలో ఉన్న హైడ్రా అధికారులు, ఇతర ప్లాట్ల యజమానులు వారిని వారించారు. హైడ్రా అధికారుల సూచన మేరకు కుషిచంద్ అక్కడి నుండి తన కారులో బయటకు వెళ్లిపోయారు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత వెంకటేష్, మరో ముగ్గురు వ్యక్తులు బైకులపై కుషిచంద్ కారును వెంబడించి, కారులో నుంచి బయటకు లాగే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత రాళ్లతో దాడి చేసి బెదిరించారు. దీంతో కుషిచంద్ తనపై జరిగిన దాడిపై గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేశాడు. శ్రీధర్‌రావు నుండి తనకు ప్రాణహానీ ఉందని, తనపై దాడికి పాల్పడ్డ వెంకటేష్, మరో ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు, వెంకటేష్ ,సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మరో ఘటనలో ఎఫ్ సీఐ లే ఔట్ లో సర్వే వద్దకు వచ్చిన నటి రమ్యశ్రీ, ఆమె సోదరుడు ప్రశాంత్ మీద శ్రీధర్ రావు అనుచరులు దాడి చేయడంతో నటి రమ్యశ్రీ గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేసింది. దీనితో గచ్చిబౌలి పోలీసులు ఈ ఘటనపై సైతం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి: అమిత్ షా

**ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవని అమిత్ షా పేర్కొన్నారు.**

ఈ కబురు: విదేశీ భాషలకు సంబంధించి కేంద్ర మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయని, అలాంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలని పేర్కొన్న ఆయన.. అవి మనుగడలో లేకుంటే నిజమైన భారతీయులుగా ఉండలేమని వ్యాఖ్యానించారు. మాజీ ఐఏఎస్ అశుతోష్ అగ్నిహోత్రి రాసిన ఓ పుస్తకాన్ని ఆవిష్కరించిన సందర్భంగా అమిత్ షా ఈ విధంగా మాట్లాడారు.''ఈ దేశంలో ఇంగ్లీషులో మాట్లాడేవారు సిగ్గుపడే రోజులు వస్తాయి. అటువంటి సమాజం ఏర్పడే రోజులు ఎంతో దూరంలో లేవు. మన దేశ భాషలే మన సంస్కృతికి రత్నాలు. మన భాషలే లేకుంటే మనం నిజమైన భారతీయులుగా ఉండలేం. దేశ భాషా వారసత్వాన్ని పునరుద్ధరించే సమయం ఆసన్నమైంది. ఇందుకోసం ప్రయత్నం చేయాలి'' అని అమిత్ షా పిలుపునిచ్చారు.మన దేశాన్ని, మన సంస్కృతిని, మన మతాన్ని అర్థం చేసుకునేందుకు ఏ పరాయి భాష సరిపోదన్నారు. విదేశీ భాషలతో సంపూర్ణ భారతీయ భావనను ఊహించుకోలేమన్నారు. అయితే, ఇది ఎంత కష్టమో తనకు తెలుసని, అయినప్పటికీ ఇందులో భారత సమాజం విజయం సాధిస్తుందన్న విశ్వాసం ఉందన్నారు. మన దేశంతోపాటు ప్రపంచాన్ని కూడా మన సొంత భాషలతోనే నడిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఐఏఎస్ అగ్నిహోత్రి మాట్లాడుతూ.. కేంద్ర సర్వీసు ఉద్యోగులకు ఇచ్చే శిక్షణలో మార్పు ఎంతో అవసరమని అన్నారు.



# యూఎస్ కాన్సులేట్ ముందు వామపక్ష పార్టీల ఆందోళన



వామపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

**ఇజ్రాయెల్ మారణహోమాన్ని ఆపాలని డిమాండ్**

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలిలోని యూఎస్ కాన్సులేట్ ముందు వామపక్ష పార్టీలు గురువారం ఆందోళనకు ప్రయత్నించాయి. ఇజ్రాయిల్ చేపడుతున్న మారణ హోమ యుద్ధాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీలు యూఎస్ కాన్సులేట్ ముందు నిరసనకు పిలుపునిచ్చాయి ఈ మేరకు గురువారం మధ్యాహ్నం పలు వామపక్ష పార్టీల సభ్యులు యూఎస్ కాన్సులేట్ వద్దకు చేరుకోగా పోలీసులు అడ్డుకొని నార్సింగి పోలీస్ స్టేషన్ కు తరలించారు. సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, ఎంసిపిఐ(యు), సిపిఐ(ఎంఎల్) లిబరేషన్, ఎస్‌యుసిఐ(సి) రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ, ఫార్వర్డ్ బ్లాక్, సిపిఐ(ఎంఎల్)' వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనకు ప్రయత్నం చేశారు. వామపక్ష పార్టీల పిలుపుతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు నిరసన చేపట్టేందుకు వచ్చిన నాయకులను అరెస్టు చేసి పలు పోలీసు స్టేషన్ల కు తరలించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి పద్మ, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి, ఏం సిపీఐ నాయకులు అనీల్ లు అరెస్టు అయిన వారిలో ఉన్నారు. అమెరికా యుద్ధకాంక్షతో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇజ్రాయిల్ ఇరాక్ మధ్య జరుగుతున్న మారణహోమ యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



వామపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు




# ఆస్పత్రిపై దాడి.. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేస్తే భారత్‌పై భారం?

**ఈ కబురు: తాజాగా ఇజ్రాయెల్‌లోని సొరొకా ఆస్పత్రిపై ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో 240 మంది వరకు గాయాలపాలైనట్లు సమాచారం. అయితే తాము ఆస్పత్రిని టార్గెట్ చెయ్యలేదని, దానికి సమీపంలో ఉన్న మిలిటరీ స్థావరాన్ని టార్గెట్ చేశామని ఇరాన్ తెలిపింది. ఈ ఆస్పత్రిలో ఉపయోగంలో లేని పాత సర్జరీ విభాగంపై మిసైల్స్ పడటంతో ఎవరూ చనిపోలేదని సమాచారం.**

ఈ ఘటనతో ఇరాన్‌పై దాడుల తీవ్రత పెంచుతామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. ఇదే సమయంలో ఇరాన్ లొంగిపోతే మంచిదని యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కూడా సూచించారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి పిచ్చి మాటలు తామెప్పుడూ వినలేదని, ఇరాన్ లొంగిపోవడం జరగదని ఆ దేశాధినేత తేల్చిచెప్పారు. అదే సమయంలో పరిస్థితి తీవ్రతరం అయితే హోర్ముజ్ జలసంధిని మూసేయాలనే ఆలోచనలో ఇరాన్ ఉన్నట్లు ఆ దేశనేత బెహనామ్ సయిాదీ వెల్లడించారు. ప్రతిరోజూ ప్రపంచం ఉపయోగించే చమురు నిల్వల్లో 20 శాతం ఈ జలసంధి నుంచి రవాణా అవుతుంది. ఈ యుద్ధం మొదలైనప్పటి నుంచే అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరిగిపోతున్నాయి. ఇప్పుడు ఈ జలసంధిని కూడా మూసేస్తే ఇంధన ధరలు ఆకాశాన్నంటుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారత్‌పై భారం..?

భారత్‌కు అవసరమైన చమురు దిగుమతుల్లో 4550 శాతం, సహజ వాయువు దిగుమతుల్లో 60 శాతం హోర్ముజ్ మార్గం నుంచే వస్తుంది. ఇప్పటికే ఇజ్రాయెల్‌ఇరాన్ వివాదం కారణంగా గ్లోబల్ మార్కెట్లో చమురు ధరలు బ్యారెల్‌కు 6465 డాలర్ల నుంచి 7475 డాలర్లకు పెరిగింది. ఇలా ముడి చమురు ధరలు పెరగడం ఆయిల్ కంపెనీలపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. ఇలాంటి సమయంలో హోర్ముజ్ జలసంధిని మూసేస్తే అంతర్జాతీయ సరఫరాకు మరింత అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. దీని ప్రభావం భారత చమురు దిగుమతులపై పడే అవాశం ఉంది. భారత్ 1314 బిలియన్ డాలర్లు (రూ. లక్షల కోట్ల) విలువైన చమురును దిగుమతి చేసుకుంటుంది. హోర్ముజ్ జలసంధిని మూసేస్తే ఆ భారం ఈ దిగుమతులపై పడుతుందని మార్కెటింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ముదురుతున్న యుద్ధం.. ఇరాన్ నోట 'హర్మ్యాజ్' మూసివేత ప్రస్తావన

ఈ కబురు: ఇజ్రాయెల్ ఇరాన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతున్న నేపథ్యంలో ఇరాన్ కీలక వ్యాఖ్యలు చేసింది. హర్మ్యాజ్ జలసంధిని కూడా మూసివేసే ఆప్షన్ తమ వద్ద ఉందని వెల్లడించింది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఈ జలసంధిని మూసివేయడం కూడా ఓ మార్గమని ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రతా కమిటీ సభ్యుడు బెహ్నాం సయిాదీ గురువారం మీడియాకు తెలిపారు. పాశ్చాత్య దేశాలు తీవ్రంగా ఒత్తిడి చేసిన సమయంలో గతంలోనూ హర్మ్యాజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ బెదిరించింది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20శాతం హర్మ్యాజ్ ద్వారానే రవాణా అవుతోంది. ప్రపంచ చమురు మార్కెట్‌కు హర్మ్యాజ్ జలసంధి జీవనాడి. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పంఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం 2 కోట్ల పీపాల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒకవంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడినుంచే వివిధ దేశాలకు చేరుతుంది. ఇరాన్‌లోని బుషెహర్ అణువిద్యుత్ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో రష్యా స్పందించింది. తక్షణమే దాడులను ఆపాలని ఆ దేశానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రష్యా విదేశాంగశాఖ మంత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. పర్షియన్ గల్ఫ్‌లోని బుషెహర్ ప్రాంతంలో ఈ అణు విద్యుత్ కేంద్రం ఉంది. ఇరాన్ ఏర్పాటు చేసుకున్న ఒకే ఒక వాణిజ్య స్థాయి అణు విద్యుత్ కేంద్రమిది. ఇది టెహ్రాన్ నగరానికి 750 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీని నిర్మాణంలో ఇరాన్‌కు రష్యా సాయమందించింది. రష్యాలో ఉత్పత్తి అయిన యురేనియం ఈ అణు విద్యుత్ కేంద్రానికి ఇంధనంగా ఉపయోగపడుతోంది.

## బ్యాంక్ బ్యాలెన్స్.. బ్యాడ్ న్యూస్..




దేశంలోనే అగ్రగామి టెలికాం కంపెనీ రిలయన్స్ జియో. ఈ టెలికాం ఆపరేటర్‌కు 47 కోట్ల మందికి పైగా యూజర్లు ఉన్నారు. కొంత మంది యూజర్లకు నెలా నెలా రీచార్జ్ చేసుకోవడం ఇష్టం ఉండదు. ఒకే సారి దీర్ఘకాలిక రీచార్జ్ ప్లాన్ల కోసం చూస్తుంటారు. ఇటువంటి వినియోగదారుల కోసం ఇప్పుడు జియో పోర్ట్ ఫోలియోలో ఒక ప్లాన్ కూడా ఉంది. ఇది ఒక రీఛార్జ్ తో మీ జియో సిమ్‌ను 365 రోజులు యాక్టివ్ గా ఉంచుతుంది.

**365 రోజుల రీఛార్జ్ ప్లాన్ ఇదే..**

రీఛార్జ్ ప్లాన్లు ఖరీదైనవిగా మారినప్పటి నుండి మొబైల్ వినియోగదారులలో లాంగ్ వాలిడిటీ ఉన్న ప్లాన్లకు డిమాండ్ వేగంగా పెరిగింది. ఇప్పుడు ఒక్క ప్లాన్ తీసుకోవడం ద్వారా ఏడాది పొడవునా రీఛార్జ్ టెన్షన్ నుంచి విముక్తి పొందవచ్చు. జియో అందిస్తున్న 365 రోజుల రీఛార్జ్ ప్లాన్ ధర రూ.3599. ఈ ప్లాన్‌తో ఏయే ప్రయోజనాల లభిస్తాయో ఇక్కడ తెలుసుకుందాం..

**ప్లాన్ ప్రయోజనాలు**

జియో రూ.3599 ప్లాన్‌తో రీచార్జ్ చేసుకుంటే 365 రోజుల వాలిడిటీని అందిస్తోంది. 365 రోజుల పాటు అన్ని నెట్‌వర్క్‌లకు అన్‌లిమిటెడ్ కాలింగ్ సదుపాయం లభిస్తుంది. ఉచిత కాలింగ్‌తోతో పాటు అన్ని నెట్‌వర్క్‌లకు ప్రతిరోజూ 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా చేసుకోవచ్చు. మీరు ఎక్కువ ఇంటర్నెట్ వాడితే, తక్కువ డేటా లిమిట్ ఉన్న ప్లాన్ సరిపోకపోతే, జియో ఈ వార్షిక ప్లాన్ మీ టెన్షన్ కు ముగింపు పలకబోతోంది. ఈ రూ.3599 ప్లాన్‌లో మీకు 912 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. రోజుకు 2.5 జీబీ వరకు ఇంటర్నెట్ వాడుకోవచ్చు. ఇందులో అర్హులైన కస్టమర్లకు అపరిమిత 5జీ డేటాను కూడా అందిస్తోంది.

ఈ వార్షిక ప్లాన్‌లో రిలయన్స్ జియో తన వినియోగదారులకు కొన్ని అదనపు ప్రయోజనాలను కూడా అందిస్తోంది. ఇందులో 90 రోజుల పాటు జియో హాట్‌స్టార్ సబ్స్క్రిప్షన్ ఉచితంగా లభిస్తుంది. ఇది కాకుండా, 50 జీబీ జియో ఏఐ క్లౌడ్ స్పేస్ కూడా ఈ ప్లాన్‌లో లభిస్తుంది. మీరు టీవీ ఛానల్స్ చూస్తున్నట్లయితే, జియో టీవీ ఉచిత సదుపాయం కూడా ఇందులో ఉంది.



## హైదరాబాద్‌లో స్వల్పంగా తగ్గిన పసిడి ధర.. మీ నగరంలో ఎంతంటే..?

**తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖలో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూడండి..**

పెళ్లిళ్లు, శుభకార్యాలు అనగానే ముందుగా గుర్తొచ్చేది బంగారమే. అంతగా మన సంస్కృతి, సంప్రదాయాలతో ముడిపడిపోయింది ఈ లోహం. అంతేకాదు.. పెట్టుబడికి పెట్టాలనుకునే వారికి పసిడి మంచి సాధనం. పసిడితో పాటు వెండికీ మంచి గిరాకీనే ఉంది. అందుకే వీటి ధరలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మరి తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడ, విశాఖ నగరాల్లో వాటి ధరలు ఎలా ఉన్నాయో చూడండి..

**బంగారం గురించి..**

బంగారం స్వచ్ఛతను క్యారట్లల్లో కొలుస్తారు. క్యారట్ల వాల్యూ పెరిగే కొద్దీ బంగారం స్వచ్ఛత, ధర పెరుగుతాయి. మేలిమి బంగారాన్ని 24 క్యారట్లుగా చెబుతారు. అంటే ఇది 99.9 స్వచ్ఛమైన బంగారమన్నమాట. ఇది కాయిన్స్, బార్స్, బిస్కెట్ల రూపంలో మాత్రమే దొరుకుతుంది.

నగల తయారీకి 22 క్యారట్ల స్వచ్ఛతతో కూడిన బంగారాన్ని వినియోగిస్తారు. ఇందులో ఇతర లోహాలు కలుపుతారు. బంగారంతో చేయించుకునే ఆభరణాలన్నీ 22 క్యారెట్లు/916 స్వచ్ఛతతో ఉంటాయి. ఈ ధర కోసం మేలిమి బంగారం ధరను 91.6 శాతంతో గుణిస్తే సరిపోతుంది.

బంగారం, వెండి వంటి విలువైన లోహాల ధరలు అంతర్జాతీయ విపణికి అనుగుణంగానే ఉంటాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతుంది. తగ్గినా అంతే. మన దేశం బంగారం కోసం దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడినందున డాలర్ మారకపు విలువ కూడా దేశీయంగా పుత్తడి ధరలపై ప్రభావం చూపుతుంది.

కొన్ని దుకాణాలు, ప్రాంతాల్లో పన్నులు, సుంకాలు ముందుగా కలపకుండా లోహాల ధరలను ప్రకటిస్తుంటాయి. దీనివల్ల ధర తక్కువగా కనపడుతుంది. ఆభరణం నచ్చి, బిల్లు వేయమన్నప్పుడు, పన్నులు/సుంకాలు కలిపితే.. ఏ ప్రాంతంలో అయినా బంగారానికి ఒకటే ధర అవుతుంది. ఆభరణం తయారీ, తరుగు ఛార్జీల్లో మాత్రం ప్రతి దుకాణానికీ తేడా ఉంటుంది.

కొంతమంది వ్యాపారులు బిల్లు లేకుండా విక్రయిస్తాం.. అప్పుడు 3 శాతం జీఎస్టీ కట్టాల్సిన అవసరం ఉండదని చెబుతుంటారు. అయితే బిల్లు లేకుండా కొంటే కొన్ని చిక్కులు ఎదుర్కోవాలి. బంగారం నాణ్యత సరిగా లేకుంటే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ఆభరణం మరమ్మతులకూ బాధ్యత వహించరు. కాబట్టి బంగారం కొనేటప్పుడు బిల్లు ముఖ్యం.

## బ్యాంక్ బ్యాలెన్స్.. బ్యాడ్ న్యూస్..




రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల రెపో రేటును 50 బేసిస్ పాయింట్ల తగ్గించింది. దీనికి అనుగుణంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లతో సహా ప్రధాన బ్యాంకులు సేవింగ్స్ అకౌంట్‌లోని బ్యాలెన్స్‌పై చెల్లించే వడ్డీ రేట్లను తగ్గించాయి. దీంతో పొదుపు ఖాతాదారులు తక్కువ రాబడిని చూస్తారు. ఈ ఏడాది క్యుములేటివ్ రేటు కోత ఇప్పుడు 1 శాతంగా ఉంది. పలు ప్రైవేటు, ప్రభుత్వ రంగ బ్యాంకులు ఒకే విధమైన తక్కువ రేట్ల విధానానికి మారడంతో డిపాజిటర్లపై ప్రభావం పడుతోంది.

**వడ్డీ రేట్లను తగ్గించిన ఎస్‌బీఐ**

దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన ఎస్‌బీఐ తన పొదుపు ఖాతా వడ్డీ రేటును జూన్ 15 నుండి అన్ని బ్యాలెన్స్‌లకు సంవత్సరానికి 2.5 శాతానికి సవరించింది. గతంలో రూ.10 కోట్ల లోపు బ్యాలెన్స్‌లపై 2.7 శాతం, రూ.10 కోట్లు అంతకంటే ఎక్కువ బ్యాలెన్స్‌లపై 3 శాతం వడ్డీని ఆఫర్ చేసేది.

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన పొదుపు రేట్లను జూన్ 10 నుండి ఫ్లాట్ 2.75 శాతానికి సర్దుబాటు చేసింది. గతంలో ఇది రూ.50 లక్షల లోపు బ్యాలెన్స్‌లపై 2.75 శాతం, రూ.50 లక్షలు అంతకంటే ఎక్కువ బ్యాలెన్స్‌లపై 3.25 శాతం వడ్డీని ఆఫర్ చేసింది.

**ఐసీఐసీఐ బ్యాంక్**

ఐసీఐసీఐ బ్యాంక్ కూడా తన వడ్డీ రేటును 2.75 శాతానికి సవరించింది. ఇది జూన్ 12 నుండి వర్తిస్తుంది. గతంలో ఇది రూ.50 లక్షల లోపు బ్యాలెన్స్‌లపై 2.75 శాతం, అంతకంటే ఎక్కువ బ్యాలెన్స్‌లపై 3.25 శాతం వడ్డీని అందించేది.

**రాబడి పెంచుకోండి..**

యువత బ్యాంక్ బ్యాలెన్స్‌పైనే దృష్టి పెట్టకుండా దాన్ని రాబడినిచ్చే పెట్టుబడి మార్గాల వైపు మళ్లించాలని నిపుణులు సూచిస్తున్నారు. పొదుపు ఖాతా మీ డబ్బును సురక్షితంగా ఉంచుతుంది. కానీ ద్రవ్యోల్బణం నెమ్మదిగా దాని విలువను తినేస్తుంది. మరోవైపు, పెట్టుబడి మీ డబ్బును కాంపౌండింగ్ శక్తి ద్వారా కాలక్రమేణా పెంచుతుంది. ఎక్కువ వడ్డీనిచ్చే పొదుపు పథకాలు, మ్యూచువల్ ఫండ్స్, సిప్‌లు లేదా స్టాక్స్ లోని ఫ్రాక్షనల్ షేర్లతో చిన్నగా ప్రారంభించవచ్చు. పెట్టుబడి పెట్టడానికి మీరు ధనవంతులు కానవసరం లేదు. మీరు ఎంత త్వరగా ప్రారంభిస్తే, మీ ఆర్థిక పునాది బలంగా మారుతుంది.




భారత ఐటీ, ఐటీఈఎస్ రంగంలో ఫ్లెక్సిబుల్ స్టాఫ్(సంస్థలకు అనుకూలంగా అవసరం మేరకే నియమకం అయ్యే ఉద్యోగులు) విధానం కీలకంగా మారుతోంది. సంస్థలు ఈ ఫ్లెక్సీ స్టాఫ్‌ను ప్రధాన శ్రామిక శక్తిగా స్వీకరించడంతో ఏటా 15 శాతం వృద్ధి చెందుతున్న గిగ్ ఎకానమీలో 2030 నాటికి 9 లక్షల మంది నిపుణులు చేరుతారని ఒక నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం దేశ ఐటీ / ఐటీఈఎస్ రంగంలో 3,90,000 ఫ్లెక్సీ స్టాఫ్ ఉన్నారు. ఇది ఈ రంగంలోని మొత్తం 5.8 మిలియన్ల నిపుణుల్లో 7 శాతం అని టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ కెరియర్‌నెట్ నివేదికలో తెలిపింది. 'ది రైజ్ ఆఫ్ ఫ్లెక్సీ స్టాఫింగ్: అవుట్లుక్ ఫర్ ఇండియా ఐటీ / ఐటీఈఎస్ టాలెంట్ ల్యాండ్ స్కేప్' పేరుతో రిపోర్ట్ తయారు చేసింది. 2030 నాటికి ఈ ఫ్లెక్సీ స్టాఫ్ రెండింతలు పెరిగి 9,00,000కు చేరుకుంటుందని, 15 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సీఏజీఆర్)తో వృద్ధి చెందుతుందని నివేదిక అంచనా వేసింది. రియల్ టైమ్ హైరింగ్ డేటా, మార్కెట్ రీసెర్చ్, ఇండస్ట్రీ ట్రెండ్స్ ఆధారంగా కెరియర్‌నెట్ ఈ నివేదికను రూపొందించినట్లు తెలిపింది. ఈ రిపోర్ట్ ప్రకారం భారత్ గ్లోబల్ ఆఫ్‌షోరింగ్ హబ్ కావడంతో ఐటీ/ ఐటీఈఎస్ సెక్టార్‌లో ఫ్లెక్సీ వర్కర్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉంది. డిజిటల్ యాక్సిలరేషన్, ప్రపంచ ఆర్థిక మార్పుల మధ్య ఫ్లెక్సీ స్టాఫింగ్ నియామకం పెరుగుతుందని, స్పెషలైజేషన్, స్కేలబిలిటీకి మద్దతు ఇచ్చేందుకు ఈ నమూనాను చాలా కంపెనీలు అనుసరిస్తున్నట్లు కెరియర్‌నెట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నీలభ్ శుక్లా తెలిపారు.

ఐటీ/ఐటీఈఎస్ శ్రామిక శక్తిలో 25 శాతంతో ఫ్లెక్సీ స్టాఫ్ నియామల్లో బెంగళూరు దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ 15 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ఢిల్లీ ఎన్‌సీఆర్, ముంబై, పుణె, చెన్నై సహా ఇతర ప్రధాన నగరాలు మొత్తం వాటాలో సుమారు 10 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఫ్లెక్సీ ఐటీ/ఐటీఈఎస్ ఉద్యోగుల్లో 20 శాతం మంది ఉన్నట్లు నివేదిక పేర్కొంది.*



## నష్టాల్లో స్టాక్ మార్కెట్లు.. ఆటో షేర్లు మాత్రం అదుర్స్!

దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర దాడులు, ముడిచమురు ధరల్లో హెచ్చుతగ్గులు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పర సుంకాలు విధించడానికి గడువు సమీపిస్తుండటం, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో బెంచ్ మార్క్ ఇండియన్ ఈక్విటీ సూచీలు ప్రతికూలంగా పయనించాయి.

బీఎస్ఈ సెన్సెక్స్ 82.79 పాయింట్లు (0.10 శాతం) క్షీణించి 81,361.87 వద్ద స్థిరపడింది. గురువారం ఈ సూచీ 81,583.94 81,191.04 శ్రేణిలో ట్రేడ్ అయింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ 50 కూడా 18.80 పాయింట్లు (0.08 శాతం) క్షీణించి 24,793.25 వద్ద స్థిరపడింది.అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, ఇండస్ఇండ్ బ్యాంక్, నెస్లే ఇండియా షేర్లు 2.50 శాతం నుంచి 1.28 శాతం మధ్య క్షీణించాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, మారుతీ సుజుకీ ఇండియా, భారతీ ఎయిర్ టెల్, లార్సెన్ అండ్ టుబ్రో 1.570.32 శాతం మధ్య లాభపడ్డాయి.

విస్తృత మార్కెట్లలో నిఫ్టీ మిడ్ క్యాప్ 100, నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 1.63 శాతం, 1.99 శాతం నష్టపోయాయి. సెక్టోరల్ ఇండెక్స్ లలో నిఫ్టీ ఆటో ఇండెక్స్ మొత్తం మార్కెట్ ధోరణులను అధిగమించి, పాజిటివ్ గా క్లోజ్ అయిన ఏకైక సెక్టోరల్ ఇండెక్స్ గా అవతరించింది. ఐషర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో లాభాలతో సూచీ 0.52 శాతం లాభపడింది.

మరోవైపు నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 2.04 శాతం నష్టంతో ముగిసింది. ఆ తర్వాత నిఫ్టీ మెటల్, మీడియా, రియల్టీ సూచీలు 1 శాతానికి పైగా నష్టపోయాయి. మిగిలిన అన్ని రంగాల సూచీలు కూడా గురువారం నష్టాల్లోనే ముగిశాయి. మార్కెట్లలో ఒడిదుడుకులను అంచనా వేసే ఫియర్ ఇండెక్స్ (ఇండియా వీఐఎక్స్) 0.14 శాతం క్షీణించి 14.26 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈలో ట్రేడైన 2,954 షేర్లలో 2,363 నష్టాల్లో ముగియగా, 516 లాభపడ్డాయి. 75 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

మార్కెట్ గురించి సాక్షి వెబ్ సైట్లో నిపుణులు వెల్లడించే అభిప్రాయాలు వారి పరిశీలన, అంచనాలను బట్టి ఉంటాయి. ఇన్వెస్టర్లకు ఇది కేవలం విషయ అవగాహన మాత్రమే తప్ప.. వారు పెట్టే పెట్టుబడులకు సాక్షి మీడియా గ్రూపు ఎలాంటి హామీ ఇవ్వదు.



## మైక్రో టర్బోజెట్ ఇంజిన్‌ను ఆవిష్కరించిన రఘువంశీ ఏరోస్పేస్

**హైదరాబాద్‌కు చెందిన రఘువంశీ ఏరోస్పేస్ గ్రూపు యూఏవీ (మానవ రహిత విహంగం), క్రూయిజ్ క్షిపణుల కోసం సొంతంగా, 40 కేజీఎఫ్ మైక్రో టర్బోజెట్ ఇంజిన్‌ను అభివృద్ధి చేసింది.**

**పారిస్ ఎయిర్ షో లో ప్రదర్శన**

**హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన రఘువంశీ ఏరోస్పేస్ గ్రూపు యూఏవీ (మానవ రహిత విహంగం), క్రూయిజ్ క్షిపణుల కోసం సొంతంగా, 40 కేజీఎఫ్ మైక్రో టర్బోజెట్ ఇంజిన్‌ను అభివృద్ధి చేసింది. దీనివల్ల ప్రొపల్షన్ టెక్నాలజీ విభాగంలో మనదేశం కీలక ముందడుగు వేసినట్లు అవుతోందని రఘువంశీ ఏరోస్పేస్ గ్రూపు ఎండీ వంశీ వికాస్ వెల్లడించారు. ఈ ఇంజిన్‌ను కంపెనీకి చెందిన హైదరాబాద్ యూనిట్లో, డీఆర్‌డీఓ అధికారుల సమక్షంలో పరీక్షించారు. అధిక థ్రస్ట్ గల ఈ ఇంజిన్, మనదేశంలో తయారైన ఇదే తరగతికి చెందిన ఇంజిన్లలో ఒకటి కావడం ప్రత్యేకత. దీన్ని 55వ అంతర్జాతీయ పారిస్ ఎయిర్ షోలో ప్రదర్శించారు. తమ ఇతర ఉత్పత్తులు కూడా సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయని వంశీ వికాస్ తెలిపారు.

అస్త్ర 100 అనే ఫిక్స్‌డ్ వింగ్ కమికాజీ యూఏవీ కూడా ప్రదర్శించారు. దాదాపు 450 కిలోమీటర్ల వేగంతో, ఆగకుండా 200 కిలోమీటర్ల దూరం ప్రయాణించగల సత్తా దీనికి ఉంది. ఫ్లైట్ కంట్రోల్, ప్రొపల్షన్, టెలీమెట్రీ.. ఇలా దీనికి సంబంధించిన అన్ని వ్యవస్థలను మనదేశంలోనే సొంతంగా అభివృద్ధి చేశారు.

హైదరాబాద్‌లో కొత్త యూనిట్ ఏర్పాటు: అత్యాధునిక ఏరోస్పేస్ సిస్టమ్‌స్‌ను ఆవిష్కరించడం కోసం రఘువంశీ ఏరోస్పేస్ గ్రూపు, హైదరాబాద్‌లోని హార్డ్‌వేర్ పార్క్‌లో 2.5 లక్షల చదరపు అడుగుల యూనిట్ నెలకొల్పుతోంది. వచ్చే ఏడాదిలో ఈ యూనిట్ అందుబాటులోకి వస్తుంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం ఈ సంస్థ, యూఎస్, యూకే దేశాలకు చెందిన డబ్ల్యూఎంటీ ప్రెసిషన్ ఎల్ఎల్‌సీ (యూఎస్ఏ); పీఎంసీ గ్రూపు (యూకే) లను కొనుగోలు చేసింది. డబ్ల్యూఎంటీ ప్రెసిషన్ ఎల్ఎల్‌సీకి ఫ్యూయల్ నాజిల్స్ ఉత్పత్తి చేయడంలో 4 దశాబ్దాల అనుభవం ఉంది. హైదరాబాద్ యూనిట్లో 1,000 మంది ఇంజినీర్లు, ఇంజినీరింగ్ నిపుణులకు ఉద్యోగాలు లభిస్తాయని వంశీ వికాస్ తెలిపారు.

విప్రో ఇన్‌ఫ్రా చేతికి లువాక్: ఫ్రాన్స్ ఏరోస్పేస్ సంస్థ లువాక్ గ్రూప్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేయనున్నట్లు ఇంజినీరింగ్, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ సొల్యూషన్స్ కంపెనీ విప్రో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంజినీరింగ్ ప్రకటించింది. లావాదేవీ విలువను వెల్లడించలేదు.

# విశ్వంభరలో భీమ్స్ ప్రత్యేక గీతం?

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు వశిష్ఠ కలయికలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. ఈ సినిమా ఓ పాట మినహా మిగిలిన చిత్రీకరణంతా ఎప్పుడో పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే.

కథానాయకుడు చిరంజీవి .. దర్శకుడు వశిష్ఠ కలయికలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. ఈ సినిమా ఓ పాట మినహా మిగిలిన చిత్రీకరణంతా ఎప్పుడో పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడీ సినిమాలో మిగిలిన ఆ ఒక్క ప్రత్యేక గీతాన్ని తెరకెక్కించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. నిజానికి ఈ చిత్రానికి ఎం.ఎం.కీరవాణి సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నప్పటికీ.. ఈ ప్రత్యేక పాటను మాత్రం భీమ్స్ సిసిరోలియో స్వర పరచనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈ పాటలో చిరుతో ఆడిపాడబోయే నాయిక వేట మొదలు పెట్టింది చిత్రబృందం. అన్నీ అనుకున్నట్లు జరిగితే జులైలోనే ఈ గీతాన్ని తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్ర విజువల్ ఎఫెక్ట్స్ పనులు ఓ కొలిక్కి రాగానే విడుదల తేదీపైనా స్పష్టత ఇవ్వనుంది చిత్ర బృందం. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న ఈ సోషియో ఫాంటసీ అడ్వెంచరస్ థ్రిల్లర్‌లో చిరంజీవి మునుపెన్నడూ చూడని విధంగా సరికొత్త పాత్రలో కనువిందు చేయనున్నారు.



# ఈ దశాబ్దంలో నాకు నచ్చిన సినిమా అదే: హీరో నాని

నేచురల్ స్టార్ నాని ఇటీవలే హిట్-3 మూవీతో ప్రేక్షకులను అలరించాడు. ఈ చిత్రంలో మోస్ట్ వయొలెంట్‌గా కనిపించి అభిమానులను మెప్పించారు. హిట్ సిరీస్‌లో వచ్చిన మూడో చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. ఈ మూవీకి శైలేశ్ కొలను దర్శకత్వం వహించారు. నాని ప్రస్తుతం ప్యారడైజ్ మూవీలో నటిస్తున్నారు.

అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన నాని ఆ చిత్రంపై ప్రశంసలు కురిపించారు. ఈ దశాబ్దంలో తనకు నచ్చిన చిత్రాల్లో మెయిజగన్(తెలుగులో సత్యం సుందరం) ఒకటని తెలిపారు. భారీ బడ్జెట్ సినిమాల మధ్య వచ్చిన ఈ చిత్రం భావోద్వేగం, వ్యక్తిగత జీవితంపై శాశ్వత ప్రభావాన్ని చూపుతుందని అన్నారు. ఇటీవల వ్యక్తిగతంగా తనకు మంచి అనుభవాన్ని ఇచ్చిన చిత్రమిదేనని వెల్లడించారు. తన సినిమా హిట్-3 ప్రమోషన్ల సందర్భంగా ఈ సినిమా గురించి విన్నానని ఓ యూట్యూబ్ ఛానల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. వేల కోట్లతో నిర్మించిన చిత్రాలకు ప్రశంసలు రావొచ్చు..కానీ ఇలాంటి కథలు రావడం చాలా అరుదైన విషయమన్నారు.

కాగా.. తమిళంలో మెయిజగన్ అనే పేరుతో ప్రేమ్ కుమార్ దర్శకత్వంతో తెరకెక్కించారు. ఈ చిత్రంలో కార్తీ, అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించారు. ఫుల్ ఎమోషనల్ డ్రామాగా వచ్చిన ఈ చిత్రాన్ని తెలుగులో సత్యం సుందరం పేరుతో రిలీజ్ చేశారు.





# కియారా కోసం బెంగళూరు నుంచి ముంబయికి

కేజీఎఫ్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ తెచ్చుకున్న యశ్ తాజా చిత్రం 'టాక్సిక్'. ఇందులో కియారా అడ్వాణీ కథానాయిక. ఆమె గర్భంతో ఉండటంతో చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకుంది.

కేజీఎఫ్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ తెచ్చుకున్న యశ్ తాజా చిత్రం 'టాక్సిక్'. ఇందులో కియారా అడ్వాణీ కథానాయిక. ఆమె గర్భంతో ఉండటంతో చిత్రబృందం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ సినిమా చిత్రీకరణను బెంగళూరులో చేస్తున్నారు. దీంతో ముంబయి నుంచి బెంగళూరు వెళ్లి రావడం కియారాకు ఇబ్బందిగా మారడంతో ఈ సినిమా చిత్రీకరణను ముంబయికి మార్చినట్లు తెలుస్తోంది. ప్రయాణాల కారణంగా కియారాకు అసౌకర్యం కలగకూడదని యశ్ సూచించడంతో దర్శకనిర్మాతలు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల బడ్జెట్ పెరగకుండా యశ్ పలు సూచనలు కూడా చేసినట్లు తెలుస్తోంది. 90ల్లో గోవాలోని ఓ డ్రగ్ మాఫియా నేపథ్యంలో సాగే కథ ఇది. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా తదితర తారలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 19న ఈ సినిమాని విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది.

# విజయ్ దేవరకొండతో సినిమా.. కీర్తి సురేశ్ సమాధానం ఇదే!



మహానటి కీర్తి సురేశ్ ప్రధాన పాత్రలో వస్తోన్న చిత్రం ఉప్పు కప్పురంబు. ఈ సినిమాలో టాలీవుడ్ హీరో సుహాస్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఫుల్ సెటైరికల్ కామెడీ ఓరియంటెడ్ మూవీగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రానికి ఐవీ శశి దర్శకత్వం వహించారు. రాధికా ఎల్ నిర్మించిన ఈ సినిమా డైరెక్ట్‌గా ఓటీటీలోనే రిలీజ్ కానుంది.

తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో కీర్తి సురేశ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానిలిచ్చారు. టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండతో మీరు నటిస్తున్నారా? అంటూ ఆమె ప్రశ్నించారు. దీనిపై స్పందించిన కీర్తి సురేశ్.. ఈ విషయాన్ని దిల్ రాజు సార్ చెబుతారంటూ నవ్వుతూ మాట్లాడింది. కాగా.. ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జులై 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది.

ఈ సినిమా గురించి కీర్తి సురేశ్ ఈవెంట్‌లో మాట్లాడుతూ.. 'ఇప్పటివరకూ చాలా డార్క్ కామెడీ సినిమాలు చూసుంటారు. కానీ అన్నిటికంటే చాలా భిన్నంగా ఉంటుంది. కుటుంబమంతా ఇంట్లో కూర్చొని హాయిగా ఈ సినిమా చూడొచ్చు. ఒక సీరియస్ విషయాన్ని చాలా ఫన్నీగా చెప్పాం' అని అన్నారు. ఈ చిత్రంలో బాబు మోహన్, శత్రు, తాళ్లూరి రామేశ్వరి, శుభలేఖ సుధాకర్, రవితేజ, విష్ణు, దువ్వాసి మోహన్, శివన్నారాయణ, ప్రభావతి వర్మ ముఖ్య పాత్రలు పోషించారు.

# అలా ఉండడమే విజయం!

తెరపై వైవిధ్యమైన కథలతో అలరిస్తూనే.. మరోవైపు నిర్మాతగా ఇటీవలే కొత్త పాత్రలోకి అడుగుపెట్టింది సమంత. ప్రస్తుతం తన రాబోయే సినిమాల చిత్రీకరణలతో తీరిక లేకుండా గడుపుతోన్న ఆమె స్వేచ్ఛగా ఉండడమే విజయమని అంటోంది.



తెరపై వైవిధ్యమైన కథలతో అలరిస్తూనే.. మరోవైపు నిర్మాతగా ఇటీవలే కొత్త పాత్రలోకి అడుగుపెట్టింది సమంత . ప్రస్తుతం తన రాబోయే సినిమాల చిత్రీకరణలతో తీరిక లేకుండా గడుపుతోన్న ఆమె స్వేచ్ఛగా ఉండడమే విజయమని అంటోంది. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంత మాట్లాడుతూ... "నన్ను విజయానికి నిర్వచనం అడిగితే.. స్వేచ్ఛ అని వెంటనే చెబుతాను. అభివృద్ధి చెందడం, పరిణతి సాధించడం, బందీగా ఉండకపోవడమే స్వేచ్ఛ. రెండేళ్లుగా నా సినిమాలు ఏవీ విడుదల కాలేదు. ఈ విరామ సమయంలో నేను చాలా స్వేచ్ఛగా ఉన్నాను. ఎవరు ఏమనుకున్నా నేను గతం కంటే ఎక్కువ సక్సెస్‌ఫుల్‌గా ఉన్నా. నేను చేస్తోన్న పనులు నాకు ఆనందాన్ని, ఉత్సాహాన్ని ఇస్తున్నాయ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం సమంత జాబితాలో 'మా ఇంటి బంగారం' , 'రక్త్‌బ్రహ్మాండ్' తదితర ప్రాజెక్టులు ఉన్నాయి.

**'ఏమాయ చేసావె' ప్రచారంలో పాల్గొనడం లేదు**

గౌతమ్ వాసుదేవ్ దర్శకత్వం వహించిన 'ఏమాయ చేసావె' చిత్రం 2010లో విడుదలై కల్ట్ క్లాసిక్‌గా యూత్‌ని బాగా ఆకట్టుకుంది. నాగచైతన్య, సమంత జంటగా నటించిన ఈ సినిమా 15ఏళ్ల తర్వాత వచ్చే నెల 18న రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో రీరిలీజ్ ప్రమోషన్స్‌లో భాగంగా సామ్, చైతన్య పాల్గొంటారంటూ వార్తలు వస్తున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ వార్తలపై సమంత స్పందించారు. "ఇలాంటి వార్తలు ఎక్కడి నుంచి పుట్టుకొస్తున్నాయో నాకు తెలీదు. చిత్రబృందంతో కలిసి నేను ఆ సినిమాను ప్రచారం చేయడం లేదు. నిజానికి నేను ప్రమోషన్స్‌కు దూరంగా ఉన్నా. బహుశా అభిమానులు.. నటీనటులు కలిసి ప్రమోట్ చేస్తే చూడాలనుకుని ఉండొచ్చు. కానీ ప్రేక్షకుల అంచనాల మేరకు ఒకరి జీవితం ఆధారపడి ఉండదు" అని ఆమె తెలిపారు. "ఏమాయ చేసావె" రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తీసిన చిత్రం. నేటికీ ఈ సినిమా అభిమానులు జెస్సీ, కార్తిక్ కెమిస్ట్రీనీ, నటనను ప్రశంసిస్తూనే ఉంటారు. ప్రస్తుతం సమంత నటిగానే కాకుండా నిర్మాతగానూ ప్రేక్షకులను అలరిస్తున్నారు. ఆమె నిర్మాతగా తీసిన ఫీచర్ ఫిల్మ్ 'శుభం' ఇటీవలే విడుదలై ప్రేక్షకులలో మంచి ఆదరణ దక్కించుకుంది.

# యంగ్ హీరో తేజ సజ్జా అరుదైన ఘనత




యంగ్ హీరో తేజ సజ్జా తన సినీ ప్రస్థానంలో అరుదైన ఘనతను సాధించారు. బాల నటుడిగా టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన తేజ.. చూడాలని వుంది, రాజకుమారుడు, కలిసుందాం రా, ఇంద్ర వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో తన నటనతో గుర్తింపు పొందారు. 2005లో వచ్చిన బోన్సాయ్ చిత్రానికి ఉత్తమ బాల నటుడిగా నంది అవార్డు అందుకుని తన టాలెంట్‌ను నిరూపించుకున్నారు.

ఇప్పుడు హీరోగా కూడా అదే స్థాయిలో విశేష గుర్తింపు పొందుతున్నారు. హనుమాన్ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో అభిమానాన్ని సంపాదించిన తేజ సజ్జా, మరో ప్రతిష్టాత్మక అవార్డు తన ఖాతాలో వేసుకున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014 నుండి 2024 మధ్య విడుదలైన సినిమాలకు గద్దర్ సినీ పురస్కారాలను ప్రదానం చేసింది. అందులో భాగంగా, 2023కి గాను ఉత్తమ ద్వితీయ చిత్రం (బెస్ట్ సెకండ్ ఫిల్మ్) విభాగంలో తేజసజ్జా హనుమాన్ చిత్రం అవార్డును గెలుచుకుంది.

బాల నటుడిగా నంది అవార్డు, హీరోగా గద్దర్ పురస్కారం అందుకొని అరుదైన రికార్డు సాధించిన నటుడిగా నిలిచారు. ప్రస్తుతం తేజ మరో సూపర్ హీరో మూవీ మిరాయ్ తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు అద్భుత స్పందన లభిస్తోంది. హనుమాన్ తరువాత తేజ నుంచి వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.



## బుమ్రా వరల్డ్ క్లాస్ బౌలరే.. కానీ!: బెన్ స్టోక్స్

బుమ్రా వరల్డ్‌క్లాస్ బౌలరే అయినప్పటికీ, అతడొక్కడే సిరీస్‌ను ఒంటి చేత్తో గెలిపించలేడని ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ బెన్‌స్టోక్స్ అన్నాడు.
ఇంగ్లండ్, టీమ్ఇండియా ల మధ్య రేపటి నుంచి (జూన్ 20) అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈనేపథ్యంలో భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా గురించి ఇంగ్లండ్ కెప్టెన్ బెన్‌స్టోక్స్ మాట్లాడాడు. బుమ్రా వరల్‌డ్‌క్లాస్ బౌలరే అయినప్పటికీ, అతడొక్కడే సిరీస్‌ను ఒంటి చేత్తో గెలిపించలేడన్నాడు. అలాగే తమ జట్టు ఆటగాళ్లు ఏ జట్టుకూ, ఏ ఆటగాడికి కూడా భయపడరన్నారు. వారంతా అంతర్జాతీయ క్రికెట్‌లో బలమైన ప్రత్యర్థులను ఎదుర్కొన్నారని కొనియాడాడు. 'అంతర్జాతీయ క్రికెట్‌లో భయం అనేది ఉండదు. అక్కడ బలమైన ప్రత్యర్థులను ఎదుర్కొనే ఉంటారు. మాకు బుమ్రా క్లాస్ తెలుసు. అతడు తన టీమ్ కోసం ఏం చేయగలడో కూడా మాకు అవగాహన ఉంది. కానీ మాకు అతడంటే భయం లేదు. కేవలం ఒక్క బౌలరే సిరీస్‌ను గెలిపిస్తాడు అని నేను అనుకోవడం లేదు. మొత్తం 11 మంది ఆటగాళ్లు సమష్టిగా రాణిస్తేనే విజయం వరిస్తుంది. ఒక్కరి వల్ల మాత్రం కచ్చితంగా విజయం సాధ్యం కాదు' అని బెన్‌స్టోక్స్ వివరించాడు.



## రోహిత్, కోహ్లీ లేని డ్రెస్సింగ్ రూమ్ వింతగా అనిపిస్తోంది: కేఎల్ రాహుల్

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకుండా తాను ఇప్పటివరకు ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఆడలేదని కేఎల్ రాహుల్ అన్నాడు.
రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లేకుండా డ్రెస్సింగ్ రూమ్‌లోకి ప్రవేశించడం వింతగా అనిపిస్తోందని కేఎల్ రాహుల్ అన్నాడు. వారిద్దరూ లేకుండా తాను ఇప్పటివరకు ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఆడలేదని, వారిని చాలా మిస్ అవుతున్నానని పేర్కొన్నాడు. సీనియర్లు రోహిత్, కోహ్లీ టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంతో ఇంగ్లాండ్‌తో జరగనున్న ఐదు టెస్టుల సిరీస్‌లో టీమ్ఇండియాకు అనుభవజ్ఞుడైన రాహుల్ కీలకం కానున్నాడు. అతనికి టెస్టుల్లో ఇంగ్లాండ్‌లో చెప్పుకోదగ్గ రికార్డే ఉంది. ఇంగ్లిష్ గడ్డపై 18 ఇన్నింగ్స్‌ల్లో 614 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, ఒక అర్ధ శతకం ఉన్నాయి. జూన్ 20 నుంచి హెడింగ్లీలోని లీడ్స్ మైదానం వేదికగా తొలి టెస్టు మొదలవనుంది.
'విరాట్, రోహిత్ గత దశాబ్ద కాలంగా భారత క్రికెట్‌కు మూల స్తంభాలుగా ఉన్నారు. వారిని చాలా మిస్ అవుతున్నా. నా మొత్తం కెరీర్‌లో కోహ్లీ లేదా రోహిత్ లేకుండా జట్టులో లేను. నేను 50కిపైగా టెస్టులు ఆడా. ఈ మ్యాచ్‌ల్లో చాలాసార్లు ఇద్దరూ, అప్పుడప్పుడు ఇరువురిలో ఒకరు జట్టులో భాగంగా ఉన్నారు. వారు లేకుండా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వెళ్లడం కొంత వింతగా అనిపిస్తోంది. అయితే, వారి నిర్ణయాన్ని తప్పనిసరిగా గౌరవించాలి. కోహ్లీ, రోహిత్ దేశానికి పూర్తిగా అన్నింటినీ అందించారు. ఎప్పటికీ భారత క్రికెట్‌లో దిగ్గజాలుగా మిగిలిపోతారు. ఇప్పుడు తర్వాతి తరం క్రికెటర్లు నిరూపించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది' అని రాహుల్ వివరించాడు.

# కొత్త రికార్డు సృష్టించిన ఐపీఎల్ 2025 ఫైనల్





ఐపీఎల్ 2025 ఫైనల్‌కు మ్యాచ్‌కు రికార్డు స్థాయిలో వీక్షణలు వచ్చాయి. ఈ విషయాన్ని ప్రసారదారు జియోస్టార్ వెల్లడించింది.ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్ వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఫైనల్‌లో 6 పరుగుల తేడాతో గెలిచిన ఆర్సీబీ తొలిసారి టైటిల్‌ను ముద్దాడింది. కోట్లాది అభిమానగణం ఉన్న ఆర్సీబీ జట్టు చాలా ఏళ్ల తర్వాత ఫైనల్‌కు చేరడం, మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగడంతో ఈ సారి ఫైనల్‌కు రికార్డుస్థాయిలో వీక్షణలు వచ్చాయి. ఈ సీజన్‌లో టీవీ, డిజిటల్ ఫ్లాట్‌పామ్స్‌లో కలిపి మొత్తం మ్యాచ్‌లకు 840 బిలియన్ల నిమిషాల వీక్షణలు వచ్చాయని ప్రసారదారు జియోస్టార్ ప్రకటించింది.ఇక, ఐపీఎల్ 2025 ఫైనల్ మ్యాచ్ అత్యధికమంది వీక్షించిన టీ20 మ్యాచ్‌గా రికార్డు సృష్టించింది. ఈ మ్యాచ్‌కు టీవీ, డిజిటల్ ఫ్లాట్‌పామ్స్‌లో కలిపి ఏకంగా 31.7 బిలియన్ల వీక్షణలు వచ్చినట్లు సమాచారం. ఫైనల్‌ను టీవీలో 169 మిలియన్ల మంది వీక్షించగా.. డిజిటల్‌లో 892 మిలియన్ వీడియో వ్యూస్‌తో కొత్త బెంచ్‌మార్క్‌ను నమోదు చేసింది. మ్యాచ్‌ను ఒకదశలో అత్యధికంగా 55 మిలియన్ల మంది వీక్షించారు. జియోస్టార్ గత సంవత్సరంతో పోలిస్తే డిజిటల్ వీక్షణల్లో 29 శాతం పెరుగుదలను నమోదుచేసింది. ఎక్కువ మంది అభిమానులు పెద్ద స్క్రీన్లలో మ్యాచ్‌లను చూడటానికి ఆసక్తి చూపించారు. టీవీలో స్టార్ స్పోర్ట్స్ 456 బిలియన్ నిమిషాల లైవ్ కవరేజీని అందించింది. ఐపీఎల్ చరిత్రలో ఇదే అత్యధికం.

## డబ్ల్యూటీసీ నూతన సీజన్‌లో ఏదేశం ఎన్ని టెస్టులు ఆడనుందంటే..?

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ నూతన సీజన్ బంగ్లాదేశ్, శ్రీలంక టెస్ట్ సిరీస్‌తో ఇప్పటికే ప్రారంభమైంది. ఆసీస్ అత్యధికంగా 22 మ్యాచ్‌లు ఆడనుంది.
వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ నూతన సీజన్ బంగ్లాదేశ్, శ్రీలంక టెస్ట్ సిరీస్‌తో ఇప్పటికే ప్రారంభమైంది. డబ్ల్యూటీసీ 2023 25 ఫైనల్ విజేతగా సౌతాఫ్రికా నిలిచిన విషయం తెలిసిందే. ఆసీస్‌తో జరిగిన పోరులో సౌతాఫ్రికా బ్యాటర్ ఐదెన్ మార్‌క్రమ్ రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతమైన శతకం బాదాడు. అలాగే కెప్టెన్ టెంబ బవుమా .. అర్ధశతకం సాధించాడు. వీరిద్దరి పోరాట పటిమతో దక్షిణాఫ్రికా 27 ఏళ్ల తర్వాత మరోసారి ఐసీసీ టైటిల్ నెగ్గింది. కానీ దక్షిణాఫ్రికా గత సీజన్‌లో కేవలం 12 టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. మిగతా జట్లన్నీ సఫారీల జట్టు కన్నా ఎక్కువ మ్యాచ్‌లే ఆడాయి. అత్యధికంగా ఇంగ్లండ్ 22 మ్యాచ్‌లు ఆడింది. 19 మ్యాచ్‌లతో టీమ్ఇండియా , ఆస్ట్రేలియా రెండో స్థానంలో, 14 టెస్ట్ మ్యాచ్‌లతో న్యూజిలాండ్, పాకిస్థాన్ మూడో స్థానంలో ఉన్నాయి.
అలాగే దక్షిణాఫ్రికా.. డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు వెళ్లే క్రమంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో ఆడలేదు. స్వదేశంలో భారత్‌తో కేవలం 2 టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే ఆడింది. అదే సమయంలో టీమ్ఇండియా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఒకదానితో ఒకటి 5 మ్యాచ్‌లు ఆడాయి. అంటే ఆయా జట్లు బలమైన ప్రత్యర్థులతో ఎక్కువ మ్యాచ్‌లు ఆడాయి. దక్షిణాఫ్రికా తక్కువ మ్యాచ్‌లు ఆడటాన్ని, బలమైన ప్రత్యర్థులతో ఆడకపోవడాన్ని పలువురు క్రికెట్ అభిమానులు తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో డబ్ల్యూటీసీ 202527 సీజన్‌లో ఏ దేశం ఎన్ని మ్యాచ్‌లు ఆడనుందనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సారి అన్ని జట్లకంటే ఎక్కువగా ఆస్ట్రేలియా 22 మ్యాచ్‌లు ఆడనుంది. తర్వాత ఇంగ్లండ్ 21, టీమ్ఇండియా 18, న్యూజిలాండ్ 16, దక్షిణాఫ్రికా 14, పాకిస్థాన్ 13, బంగ్లాదేశ్, శ్రీలంక 12 మ్యాచ్‌ల చొప్పున ఆడనున్నాయి. స్వదేశంలో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ 11, టీమ్ఇండియా 9, దక్షిణాఫ్రికా 8, న్యూజిలాండ్, వెస్టిండీస్ 7, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్థాన్ 6 మ్యాచ్‌లు ఆడనున్నాయి.
భారత్ స్వదేశంలో వెస్టిండీస్‌తో 2, దక్షిణాఫ్రికాతో 2, ఆస్ట్రేలియాతో 5 మ్యాచ్‌లు ఆడనుంది. అలాగే విదేశంలో ఇంగ్లండ్‌తో 5, శ్రీలంకతో 2, న్యూజిలాండ్‌తో 2 టెస్ట్ మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో భాగంగా రేపటి నుంచే (జూన్ 20) టీమ్ఇండియా, ఇంగ్లండ్‌తో అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది.






# ప్రపంచకప్ టోర్నీకి సన్నాహాలు

**నాలుగు దేశాల జూనియర్ హాకీ టోర్నీ బరిలో భారత్**
**జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్‌తో మ్యాచ్‌లు**

న్యూఢిల్లీ: జూనియర్ హాకీ ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా... భారత జట్టు నాలుగు దేశాల సిరీస్‌కు సిద్ధమైంది. ఈ నెల 21 నుంచి 25 వరకు జర్మనీ వేదికగా జరగనున్న ఈ టోర్నీలో ఆతిథ్య జర్మనీ, ఆస్ట్రేలియా, స్పెయిన్‌లతో యువ భారత జట్టు తలపడనుంది. భారత జూనియర్ జట్టుకు అరిజీత్ సింగ్ హుందల్ సారథ్యం వహిస్తుండగా... అమీర్ అలీ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సిరీస్ కోసం భారత జట్టు బుధవారం బెంగళూరు నుంచి బెర్లిన్‌కు బయలుదేరింది.
శనివారం జరగనున్న తొలి పోరులో ఆతిథ్య జర్మనీతో భారత్ తలపడనుంది. అనంతరం ఆదివారం ఆస్ట్రేలియాతో, మంగళవారం స్పెయిన్‌తో మ్యాచ్‌లు ఆడనుంది. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరగనున్న ఈ సిరీస్‌లోని అన్ని మ్యాచ్‌లు బెర్లిన్‌లో నిర్వహించనున్నారు. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఈ నెల 25న ఫైనల్ జరగనుంది. '2025 జూనియర్ హాకీ వరల్‌డ్‌కప్‌నకు ముందు ఈ టోర్నమెంట్ భారత జట్టుకు ఎంతో కీలకం కానుంది.
మెగా టోర్నీకి ఎక్కువ రోజులు లేకపోవడంతో... ఇది సన్నద్ధతకు చక్కగా తోడ్పడనుంది. బలాబలాలను బేరీజు వేసుకోవడంతో పాటు జట్టు కూర్పును సిద్ధం చేసేందుకు ఉపకరిస్తుంది. ఇంకా మెరుగవ్వాల్సిన అంశాలేంటి అనేదానిపై కూడా ఒక స్పష్టత వస్తుంది. బలమైన ప్రత్యర్థులతో తలపడ్డప్పుడే మన బలహీనతలు బయటపడతాయి'అని హాకీ ఇండియా ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు భారత్ వేదికగా జూనియర్ హాకీ ప్రపంచకప్ జరగనుంది.